నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

**నేటి కందం-నేటికి అందం**

నేటి సమావేశములో
నీటి సమస్యలను గూర్చి నిర్భరగతిలో
చాటించి ముఖ్యమంత్రులు
ధాటిగ నిలబెట్టినారు దక్షిణపు ప్రభన్ !!

(31 వ దక్షిణాది రాష్ట్రాల సమావేశం కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్ షా గారి ఆధ్వర్యంలో మహాబలిపురం లో జరిగింది. దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొని ఎన్నో విషయాలను చర్చించారు. ముఖ్యంగా నీటి సమస్యలను విభజన సమస్యలను అమిత్ షా గారి దృష్టికి తీసుకెళ్లారు. అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం కోసం కృషి చేస్తానని దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆయన ఆకాంక్షించారు)

-రాధశ్రీ

సెల్:9494481210




# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com


**చురక**

విద్యార్థుల మెదళ్లలో
విషతుల్యం పోతలు
సామాజిక మాధ్యమాల
చెడును పెంచె రోతలు.
నేర ఘోర ప్రవృత్తికి
నెట్టుతున్న కారకాలు
కంట్రోలు చేయకుంటే
కట్టు తప్పే పూరకాలు.

-వేల్పుల నారాయణ

9440433475



హైదరాబాద్ శనివారం 22-8-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:15 పేజీలు:6 వెల: రూ.1/-

# స్పేస్ స్టార్టప్ సంస్థల ప్రతినిధులతో ప్రధాని భేటీ..

న్యూఢిల్లీ, ఆగస్టు 21: భారత్‌ను ప్రపంచంలోనే ప్రముఖ అంతరిక్ష సాంకేతిక కేంద్రంగా (స్పేస్ హబ్) తీర్చిదిద్దే దిశగా వేగంగా అడుగులు వేయాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. దేశంలోని ప్రముఖ స్పేస్ స్టార్టప్ సంస్థల సీఈఓలు, వ్యవస్థాప కులతో శుక్రవారం న్యూఢిల్లీలో సమావేశమైన ప్రధాని.. అంతరిక్ష రంగంలో యువ పారిశ్రామికవేత్తలు చేస్తున్న కృషిని అభినందించారు. భారత అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యం పెరగ డం, కొత్త ఆవిష్కరణలు రావడం దేశానికి కీలక పరిణామమని ప్రధాని పేర్కొన్నారు. ప్రపంచం అంతరిక్ష రంగం గురించి ఆలోచించినప్పుడు భారత్ వైపు చూసేలా బలమైన వ్యవస్థను నిర్మించాలని సూచిం చారు.

## 20 స్పేస్ స్టార్టప్‌ల ప్రతినిధులతో భేటీ

ఈ సమావేశంలో దేశంలోని 20 ప్రముఖ అంతరిక్ష స్టార్టప్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.Skyroot Aerospace, Agnikul Cosmos, Pixxel, Dhruva Space వంటి సంస్థల ప్రతినిధులు తమ ఆలోచనలు, భవిష్యత్ ప్రణాళికలను ప్రధానికి వివరించారు. యువ శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు అంతరిక్ష రంగంలో కొత్త మార్గాలను అన్వేషించడం అభినంద నీయమని మోదీ అన్నారు.

## స్టార్టప్‌లకు ప్రభుత్వ సహకారం

అంతరిక్ష రంగంలో చేపట్టిన సంస్కరణలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని ప్రధాని తెలిపారు. ప్రైవేటు సంస్థలు, స్టార్టప్‌లకు కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. అంతరిక్ష రంగాన్ని కేవలం రాకెట్లు, ఉపగ్రహాలకే పరిమితం చేయ కుండా.. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే సాంకేతికతగా అభివృద్ధి చేయాలని సూచించారు.

## వ్యవసాయం నుంచి పర్యావరణం వరకు..

అంతరిక్ష సాంకేతికతను ఇతర రంగాలతో అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని ప్రధాని పేర్కొన్నారు. ఉపగ్రహాల ద్వారా లభించే సమాచారాన్ని వ్యవసాయం, వాతావరణ అంచనాలు, పర్యావరణ పరిరక్షణ, విపత్తుల నిర్వహణ వంటి రంగాల్లో మరింత సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. అలాగే అంతరిక్ష వ్యర్థాల నిర్వహణ (స్పేస్ డెబ్రిస్) వంటి సవాళ్లపై కూడా దృష్టి పెట్టాలని స్టార్టప్‌లకు సూచించారు.

## ప్రపంచం భారత్‌వైపు చూసేలా..

భారత్‌లో అంతరిక్ష రంగానికి అవసరమైన ప్రతిభ, సాంకేతిక సామర్థ్యం, యువ శక్తి అందుబాటులో ఉందని ప్రధాని అన్నారు. ప్రభుత్వ విధానాలు, ప్రైవేటు రంగ ఆవిష్కరణలు కలిసి పనిచేస్తే భారత్ ప్రపంచ అంతరిక్ష రంగంలో



అగ్రస్థానానికి చేరుకుంటుందని పేర్కొన్నారు.

"అంతరిక్ష రంగంలో భారత్ కొత్త శిఖరాలను చేరాలి. ప్రపంచానికి అవసరమైన పరిష్కారాలు అందించే స్థాయికి ఎదగాలి" అని ప్రధాని మోదీ ఆకాంక్షించారు.

దేశంలో పెరుగుతున్న స్పేస్ స్టార్టప్ వ్యవస్థను ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్‌లో భారత్‌ను గ్లోబల్ స్పేస్ హబ్‌గా నిలబెట్టడమే లక్ష్యంగా కేంద్రం పనిచేస్తోందని ప్రధాని స్పష్టం చేశారు.

# 'షావుకారు' జానకి కన్నుమూత



హైదరాబాద్, ఆగస్టు 21:గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రముఖ నటీమణి షావుకారు జానకి (95) చెన్నై కావేరీ హాస్పిటల్ లో తుదిశ్వాస విడిచారు. దాదాపు ఏడున్నర దశాబ్దాలుగా సినిమా రంగంలో నటిగా తనదైన ముద్రవేశారామె. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన జానకి 1931 డిసెంబర్ 12న జన్మించారు. ఆమె తల్లి దండ్రులు శచీదేవి, టేకుమళ్ళ వెంకోజీరావు. తండ్రి రాజమండ్రిలో గవర్నమెంట్ పేపరు ఎక్స్ పర్టు అండ్ కెమికల్ ఇంజనీరుగా పనిచేసేవారు. ఆమెకు ముగ్గురు అన్నదమ్ములు, ఇద్దరు చెల్లెళ్ళు. వారిలో ఒకరు ప్రముఖ నటి కృష్ణకుమారి.సినిమా వార్తలు

తండ్రి ఉద్యోగరీత్యా 1944లోనే జానకి కుటుంబంతో మద్రాసు చేరారు. అక్కడ ఆలిండియా రేడియోలో ఆమె చిన్న పిల్లల కార్యక్రమంలో పాల్గొనే వారు. ఆ రకంగా సినిమా రంగంతో జానకి కుటుంబానికి పరిచయాలు ఏర్పడ్డాయి. 1947 నవంబర్ 5న ఆమెకు శంకరమంచి శ్రీనివాసరావుతో వివాహం జరిగింది. ఆ తర్వాతే ఆమె సినిమా రంగంలోకి అడుగుపెట్టారు. విజయవారి 'షావుకారు' సినిమాతో 1950లో సినీరంగ ప్రవేశం చేసిన జానకి వివిధ భాషల్లో దాదాపు 380 చిత్రాలలో నటించారు. ఆమె నటించిన చివరి చిత్రం 2023లో వచ్చిన 'అన్నీ మంచి శకునములే'.

'షావుకారు' జానకి పేరు వినగానే ముందుగా ఆమె గళం గుర్తుకు వస్తుంది. గాయని కాకపోయినా, ఆమె గాత్రం నుండి జాలువారిన మాటలు వినసొంపుగా ఉండేవి. ఆ గళమహిమతోనే చిత్రసీమలో జైత్రయాత్ర చేశారు జానకి. విజయా సంస్థ ఎల్వీ ప్రసాద్ డైరెక్షన్ లో నిర్మించిన 'షావుకారు' చిత్రంతో చిత్రసీమలో అడుగు పెట్టిన జానకి, నాటి మేటి నటీనటుల సరసన తొలి సినిమాతోనే దీటుగా నటించి భళా అనిపించుకున్నారు జానకి. అందువల్లే 'షావుకారు' టైటిలే జానకి ఇంటిపేరుగా మారింది.

పాత్ర ఏదైనా సరే ఇట్టే పరకాయ ప్రవేశం చేయడం షావుకారు జానకి నైజం. తన దరికి చేరిన ప్రతి పాత్రకు న్యాయం చేయడానికే తపించారు జానకి - ఇది నిజం. భక్తిరస పాత్రలు పోషించే సమయంలో జానకి ఎంతో నిష్టగా ఉండేవారు. ఆ పాత్రలను రక్తి కట్టించేవారు. తెలుగులోనే కాదు తమిళ, కన్నడ, మళయాళ చిత్రాల్లోనూ తనదైన అభినయంతో ఆకట్టుకున్నారు షావుకారు జానకి. తమిళ చిత్రాలలోనే ఎక్కువగా హీరోయిన్ వేషాలు వేశారు.

తెలుగు చిత్రాల్లో అనేక వైవిధ్యమైన పాత్రలు ధరించి ప్రేక్షకుల జేజేలు అందుకున్నారు జానకి. కొన్ని పాత్రల్లో జానకిని తప్ప ఇతరులను ఊహించుకోలేం. 'మంచి మనసులు'లో అంధురాలిగా ఆమె నటించిన వైనాన్ని మరచిపోలేం.

తన సొంత చెల్లెలు కృష్ణకుమారి ఆగమనంతో జానకికి తెలుగులో నాయిక పాత్రలు తగ్గాయి. అయినా వెరవలేదు. తన మనసుకు నచ్చిన కేరెక్టర్ దొరికితే చాలు ఎంతో పొంగిపోయేవారు జానకి. పలు చిత్రాల్లో బరువైన పాత్రలు పోషించి మెప్పించారు జానకి. 'కన్యాశుల్కం'లో బుచ్చమ్మ పాత్రలో జానకి వెండితెరపై జీవించారు. ఇక 'శ్రీవేంకటేశ్వర మహాత్మ్యం'లో ఎరుకల సానిగా జానకి అభినయాన్ని ఈ నాటికీ జనం మరచిపోలేదు. వయసు మీద పడ్డా అందుకు తగ్గ పాత్రల్లో షావుకారు జానకి తనదైన బాణీ పలికించారు. యాభై ఏళ్ళు దాటాక కూడా 'తాయారమ్మ- బంగారయ్య' చిత్రంలో జానకి అభినయించిన తీరు చూసి ఆ నాటి యంగ్ హీరోయిన్స్ సైతం ఆశ్చర్యపోయారు. 'తాయారమ్మ'గా జానకి నటన ప్రేక్షకులను ఎంతగానో రంజింప చేసింది.

## నటరత్న యన్టీఆర్ తో..

నటరత్న యన్టీఆర్ తో షావుకారు జానకి 'చిత్ర'బంధం ప్రత్యేకమైనది. ఎందుకంటే యన్టీఆర్ హీరోగా నటించిన తొలి చిత్రం 'షావుకారు'. అలా యన్టీఆర్ తొలి హీరోయిన్ జానకి. అలాగే ఆమెకు తొలి కథానాయకుడు యన్టీఆర్. వారి జంట అనేక చిత్రాల్లో ప్రేక్షకులకు కనుల పండగ చేసింది. తన తొలి హీరోయిన్ కావడంతో యన్టీఆర్ షావుకారు జానకిని ఎంతగానో గౌరవించేవారు. ఆ గౌరవం కడదాకా సాగింది. యన్టీఆర్ తొలి సొంత చిత్రం 'పిచ్చిపుల్లయ్య'లో ఆమె ఓ నాయికగా నటించారు. అందులో జానకి జోడీగా అమర్ నాథ్ నటించారు. అదే సినిమాలో యన్టీఆర్ కు జంటగా జానకి సొంత చెల్లెలు కృష్ణకుమారి అభినయించారు. యన్టీఆర్ తమ 'యన్.ఏ.టి.' బ్యానర్ లోగోలో శ్రీవేంకటేశ్వర స్వామి వారి విగ్రహానికి కుడివైపు జానకిని లక్ష్మీదేవిగా కూర్చుండబెట్టి చూపించారు.

'యన్.ఏ.టి.'వారి 'పాండురంగ మహాత్మ్యం' నుంచీ ఈ లోగోలో జానకి కనిపించడం మొదలయింది. తన తొలి కథానాయిక జానకిని ఓ దేవతామూర్తిగా గౌరవించారు యన్టీఆర్. యన్.ఏ.టి. బ్యానర్ లోగోలో లక్ష్మీదేవిగా కనిపించిన షావుకారు జానకి అంటే యన్టీఆర్ తమ్ముడు త్రివిక్రమరావుకు కూడా ఎంతో గౌరవం. తాను స్వస్తిశ్రీ బ్యానర్ పై నిర్మించిన 'రేచుక్క-పగటిచుక్క' సినిమాలో జానకినే నాయికగా ఎంచుకున్నారు త్రివిక్రమరావు. అందులోనూ యన్టీఆర్, జానకి జంట ప్రేక్షకులను అలరించింది.

యన్టీఆర్ సరసన జానకి నటించిన "వద్దంటే డబ్బు, కన్యాశుల్కం, సొంతవూరు, జయం మనదే, కాడెద్దులు ఎకరం నేల, పెంపుడు కూతురు, సవతి కొడుకు, దేశద్రోహులు" వంటి చిత్రాలు ప్రేక్షకుల ముందు నిలిచాయి. ఇక యన్టీఆర్ నటించిన అనేక సినిమాల్లో జానకి కీలక పాత్రల్లో నటించి ఆకట్టుకున్నారు. యన్టీఆర్ ను జానకి దైవాంశ సంభూతునిగానే భావించేవారు.

## షావుకారు జానకి మృతి.. సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం

హైదరాబాద్, ఆగస్టు 21:ప్రముఖ నటి, పద్మశ్రీ అవార్డు గ్రహీత షావుకారు జానకి మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆమె మరణం చలనచిత్ర రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. షావుకారు జానకి కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చిన్నతనం నుంచే నాటకాల్లో వివిధ పాత్రలు పోషిస్తూ కళారంగంలోకి అడుగుపెట్టిన షావుకారు జానకి.. దాదాపు ఏడు దశాబ్దాల పాటు చలనచిత్ర రంగంలో తనదైన ముద్ర వేశారని సీఎం గుర్తుచేశారు. 'షావుకారు' చిత్రంలో అసమాన ప్రతిభ కనబరిచి 'షావుకారు జానకి'గా స్థిరపడిన ఆమె.. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో దాదాపు 400 చిత్రాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారని తెలిపారు. హిందీ, మలయాళ చిత్రాల్లోనూ నటించి తన బహుముఖ ప్రతిభను చాటుకున్నారని పేర్కొన్నారు.

పలు మేటి చిత్రాల్లో షావుకారు జానకి పోషించిన పాత్రలు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని రేవంత్‌రెడ్డి కొనియాడారు. సినీ రంగానికి ఆమె అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆమె లేని లోటు పూడ్చలేనిదని అన్నారు. భగవంతుడు షావుకారు జానకి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ.. ఆమె కుటుంబ సభ్యులు, అభిమానులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిందే..

## పీఎస్ ఎదుట రాహుల్ గాంధీ నిరసన



న్యూఢిల్లీ, ఆగస్టు 21: పెల్లెట్ గన్ బాధితుడికి న్యాయం చేయాలంటూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ నేడు నిరసనకు దిగారు. ఢిల్లీలోని పార్లమెంటు స్ట్రీట్ పోలీస్ స్టేషన్ ఎదుట నిరసనకు తెరతీశారు. సంసద్ యాత్ర సందర్భంగా పెల్లెట్ గన్ ప్రయోగంతో తనకు గాయాలయ్యాయని సాహిల్ లోచాబ్ అనే యువకుడు ఆరోపించాడు. ఈ విషయమై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని తాను ఎన్ని సార్లు కోరినా పోలీసులు లక్ష్యపెట్టడం లేదని ఆరోపించాడు.

ఈ క్రమంలో రాహుల్ గాంధీ నేడు సాహిల్ లోచాబ్‌ను వెంట తీసుకుని పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. తొలుత రాహుల్ గాంధీ కాన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అయితే, న్యూఢిల్లీ డీసీపీ సచిన్ శర్మ పార్లమెంటు స్ట్రీట్ పీఎస్‌లో ఉన్నారని తెలియడంతో అక్కడకు వెళ్లారు. పెల్లెట్ గన్‌తో దాడి ఘటనపై దర్యాప్తు ఎంత వరకూ వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎంపీ రాహుల్ గాంధీ అకస్మాత్తుగా రావడంతో పోలీసులు ఒకింత ఆశ్చర్యపోయారు. అయితే, ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు మాత్రం వారు తిరస్కరించారు.

దీంతో, పోలీసుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన రాహుల్ గాంధీ స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసనకు దిగారు.

సంసద్ ఛలో యాత్ర సందర్భంగా పార్లమెంటుకు సమీపంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది విద్యార్థులపై పెల్లెట్ గన్‌తో కాల్పులు జరిపారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. అయితే, ఢిల్లీ పోలీసులు మాత్రం ఈ ఆరోపణలు తోసిపుచ్చారు. సీఆర్‌పీఎఫ్ కూడా ఇప్పటివరకూ స్పందించలేదు.

# భారత నావికులు ప్రయాణిస్తున్న నౌకపై ఇరాన్ దాడి..

న్యూఢిల్లీ, ఆగస్టు 21:అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతల ప్రభావంతో హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకల భద్రతపై ఆందోళనలు పెరుగుతున్నాయి. ఇరుదేశాల ఘర్షణతో హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకల పరిస్థితి దారుణంగా తయారైంది. అనేక నౌకలపై ఇరాన్, అమెరికా దాడులు చేశాయి. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 22న భారతీయ సిబ్బంది ప్రయాణిస్తున్న నౌకపై దాడికి సంబంధించిన వీడియో తాజాగా బయటకు వచ్చింది. దీనిని ఫార్వర్డ్ సీమెన్స్ యూనియన్ ఆఫ్ ఇండియాఎక్స్ వేదికగా షేర్ చేసింది.

ఏప్రిల్ 22న 21 మంది భారతీయులతో సహా మొత్తం 22 మంది సిబ్బందితో ప్రయాణిస్తున్న నౌకను ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కు చెందిన సాయుధ పడవలు చుట్టుముట్టినట్లు ఎఫ్ఎస్‌యూఐ తెలిపింది. ఐఆర్జీసీ బలగాలు నౌకపై ఆర్పీజీ కాల్పులు జరిపినట్లు, దీంతో సిబ్బంది భయంతో నౌక లోపల దాక్కున్నట్లు వెల్లడించింది. '

వీరు సముద్రపు దొంగలు కాదు. వీరు ఐఆర్జీసీకి చెందిన నావికా దళాలు' అని ఎఫ్ఎస్‌యూఐ పేర్కొంది. వాణిజ్య నౌకల్లో పనిచేస్తున్న పౌర సిబ్బందిని కేవలం భద్రతా సూచనలు, మార్గదర్శకాలతో మాత్రమే రక్షించడం సాధ్యం కాదని యూనియన్ ఆందోళన వ్యక్తం చేసింది.

కాగా, ఏప్రిల్ 22న హోర్ముజ్ జలసంధిలో రెండు వాణిజ్య నౌకలను స్వాధీనం చేసుకున్నట్లు ఇరాన్ ప్రకటించింది.

మరో నౌకపైనా కాల్పులు జరిపింది. ఈ దాడుల్లో ప్రభావితమైన మూడు నౌకల్లోని రెండింటిలో మొత్తం 22 మంది భారతీయ నావికులు ఉన్నట్లు భారత ఓడరేవులు, నౌకాయాన, జలమార్గాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇరాన్ అదుపులోకి తీసుకున్న నౌకల్లో ఒకటైన ఎపమినోండాస్‌లో ఓ భారతీయ నావికుడు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మరో నౌక యూఫోరియాలో 21 మంది భారతీయ సిబ్బంది ఉన్నారు.

అయితే, ఈ నావికులంతా సురక్షితంగా ఉన్నారని భారత ప్రభుత్వం స్పష్టం హోర్ముజ్ జలసంధిలో చోటుచేసుకున్న ఈ ఘటనలు వాణిజ్య నౌకల భద్రతపై మరోసారి ఆందోళనలను పెంచాయి. యుద్ధ పరిస్థితుల్లో ఆయుధ ఘర్షణలకు పౌర నౌకలు, వాటిలో పనిచేస్తున్న సిబ్బంది గురికాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఈ ఘటన స్పష్టం చేస్తోంది.

# నెలవారి నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించిన ములుగు జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్నాథ్, ఐపిఎస్

**-సైబర్ నేరాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశం**

**-విధులలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులు, సిబ్బందిని అభినందించి సర్టిఫికెట్ లు మంజూరు చేసిన జిల్లా ఎస్పీ**



ములుగు ఆగష్టు 21:(నేటినిజం ప్రతినిధి): ఈరోజు అనగా 19.08.2026 నాడు ములుగు జిల్లా కేంద్రం లోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్నాథ్,ఐపీఎస్ గారు నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మొదటగా జిల్లా ఎస్పీ గారు అధికారులతో మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధతను కలిగి ఉండాలని, పక్షపాతం లేకుండా సమానత్వం పాటించాలని, బాధితులందరినీ ఒకే విధంగా చూడాలని అందరికీ న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ గారు కోర్టులో ట్రయల్ లో ఉన్న కేసుల గురించి ఆరా తీసి, ప్రతికేసులోను తప్పనిసరిగా సాక్షులకు, ముద్దాయిలకు సమన్లు అందించాలని ఆదేశాలు జారీ చేశారు. నేరస్తులకు శిక్ష పడే విధంగా కోర్టు కానిస్టేబుల్ లు విధులు నిర్వహించాలని, అంతిమంగా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు.

ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్, సస్పెక్ట్ షీటర్స్ గురించి ఆరా తీసి, వారిని ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తూ ఉండాలని, వారి వివరాలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ ఉండాలని ఆదేశించారు.

ఈ నెలలో నమోదైన కేసుల వివరాలపై పోలీస్ స్టేషన్ ల వారీగా ఆరా తీసి, కేసులలో త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా ప్రతి కేసులోనూ ఎప్పటికప్పుడు ఆన్లైన్లో ఫైల్ అప్డేట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.దొంగతనాలు, ఆర్థిక నేరాలలో ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా దర్యాప్తును ముమ్మరం చేయాలని, పోగొట్టుకున్న నగదు లేదా వస్తువులను బాధితులకు అప్పగించేలా కృషి చేయాలి అని ఆదేశించారు.పాత కేసుల దర్యాప్తులో పురోగతిని పరిశీలించి, త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని, బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని ఆదేశాలు జారీ చేశారు.అదే విధంగా జిల్లాలో ఇసుక అక్రమ రవాణ పైన నిఘా ఉంచాలని అన్నారు. చెక్ పోస్టులలో సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఇసుక అక్రమ రవాణా ను కట్టడి చేయాలని ఆదేశించారు.అలాగే సీసీ కెమెరాలు ఏర్పాటుపై ప్రజలలో అవగాహన తీసుకొని వచ్చి కొత్త సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని సూచనలు చేశారు.రోడ్డు ప్రమాదాలపై ప్రజలలో అవగాహన కల్పించాలని, రోడ్డు ప్రమాదాలను నివారించేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు.

మహిళలపై జరిగే నేరాలలో వీలైనంత త్వరగా విచారణ చేసి పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవాలి అని ఆదేశించారు.యువత ఆన్లైన్ బెట్టింగ్ వలలో పడి మోసపోకుండా పోలీస్ స్టేషన్ ల వారీగా అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఎవరైనా ఆన్లైన్ బెట్టింగ్ ని ప్రోత్సహిస్తే వల్ల పైన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారి చేశారు.

యువత, ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా సైబర్ క్రైమ్ నేరాలపై ఆయా పోలీస్ స్టేషన్ ల పరిధి లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదేశించారు.అనంతరం తమ విధులలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సిబ్బందిని జిల్లా ఎస్పీ గారు అభినందించి రివార్డు సర్టిఫికెట్ లు మంజూరు చేశారు.

ఈ కార్యక్రమంలో ఏటూరు నాగారం ఏఎస్పీ మనన్ భట్,ఐపీఎస్, డిసిఆర్బి డిఎస్పి కిషోర్, ములుగు డీఎస్పీ రవీందర్, సీసీఎస్ ఇన్స్పెక్టర్ కుమార్,సిఐ పస్రా దయాకర్, సిఐ ఏటూరునాగారం సూర్య ప్రకాష్ , సిఐ ములుగు సురేష్, సిఐ వెంకటాపురం రమేష్, ఆర్ ఐ లు స్వామి,వెంకటనారాయణ, శ్రీకాంత్, తిరుపతి, ఎస్ఐ ములుగు వెంకటేష్, ఎస్ఐ వెంకటాపూర్ రాజు, ఎస్ఐ పస్రా తాజుద్దీన్, ఎస్సై నార్లపూర్ కమలాకర్, ఎస్ఐ తాడ్వాయి జగదీష్, ఎస్ఐ ఏటూరునాగారం మహేష్, ఎస్ఐ మంగపేట సూరి, ఎస్సై కన్నాయిగూడెం వెంకటేష్, ఎస్ఐ వాజేడు సతీష్ , ఎస్ఐ పేరూరు కృష్ణ ప్రసాద్, ఎస్సై వెంకటాపురం తిరుపతి, ఐటీ కోర్ టీం, డిసిఆర్బి సిబ్బంది పాల్గొన్నారు

# హైకోర్టులో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసు విచారణ.. సెప్టెంబర్ 16న తీర్పు

హైదరాబాద్, ఆగస్టు 21: తెలంగాణలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టులో ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. దీంతో సెప్టెంబర్ 16న తీర్పును వెల్లడించనున్నట్లు న్యాయస్థానం తెలిపింది. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ తరఫు న్యాయవాదులు హైకోర్టులో వాదనలు వినిపించారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఆయా ఎమ్మెల్యేలు ప్రచారం చేసిన వీడియోలను న్యాయస్థానానికి సమర్పించారు. అభివృద్ధి కోసం మాత్రమే ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని ఫిరాయింపు ఎమ్మెల్యేలు అంటున్నారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది గండ్ర మోహన్ రావు కోర్టుకు తెలియజేశారు.

ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని.. జాతీయ జెండాగా చెబుతున్నారని, జాతీయ జెండాలో అశోక చక్రం ఉంటుందని గండ్ర మోహన్ రావు.. కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే దానం నాగేందర్.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఎన్నికై, ఎమ్మెల్యే పదవిలో కొనసాగుతూనే కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేశారని కోర్టుకు వివరించారు. పార్టీ సభ్యత్వం లేని వ్యక్తులకు ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం సాధ్యం కాదని అన్నారు. ప్రధాన పత్రికలు, టీవీ ఛానళ్లలో ప్రసారమైన వార్తా కథనాలు, వీడియోలను కూడా బీఆర్ఎస్ తరఫు న్యాయవాది గండ్ర మోహన్ రావు న్యాయస్థానం ముందు ఉంచారు.

# మతం కన్న మానవత్వమే మిన్న

## (22 ఆగష్టు "మతం లేదా విశ్వసం ఆధారంగా హింసాత్మక ఘటనల బాధితులను స్మరించుకునే అంతర్జాతీయ దినం" సందర్భంగా)

మతం, కులం, విశ్వాసాలను పాటించడానికి రాజ్యాంగం హక్కులను కల్పించింది. కులమతాలు మన వ్యక్తిగత అంశాలు. కులమతాలు మానవాళి ఐక్యతకు, ప్రపంచ శాంతికి అడ్డుపడరాదు. మాట్లాడడం, అభిప్రాయాలను వ్యక్తం చేయడం, విశ్వాసాలు పాటించడం, ఆచారాలను గౌరవించడం, పరమత సహనం కలిగి ఉండడం పౌర సమాజ కనీస కర్తవ్యం. మతం లేదా విశ్వాసం ఆధారంగా హింసాత్మక చర్యల బాధితులు లేదా వారి కుటుంబ సభ్యులను స్మరించుకోవడం లేదా సహాయం చేయడానికి ప్రతి ఏట 22 ఆగష్టు రోజున "మతం లేదా విశ్వసం ఆధారంగా హింసాత్మక ఘటనల బాధితులను స్మరించుకునే అంతర్జాతీయ దినం" పాటించాలని ఐరాస సర్వసభ్య సమావేశం తీర్మానించడం హర్షదాయకం. మతం ఆధారంగా ఒక వర్గానికి చెందిన గృహాలను ధ్వంసం చేయడం, హింసాత్మక ఘటనలకు పూనుకోవడం, ఆస్తులు/వ్యాపారాలు/విద్యాలయాలు/సాంస్కృతిక కేంద్రాలు/ప్రార్థనా స్థలాలపై పలు రకాలుగా హింసాత్మక చర్యలకు పూనుకోవడం లాంటి సంఘటనలను తీవ్ర స్థాయిలో వ్యతిరేకించాలి లేదా ఖండించాలి.

పెహల్గామ్ హింసాత్మక దుర్ఘటన మతపరమైనదే :

మైనారిటీల హక్కుల పరిరక్షణ, పరమత సహనం, మతం లేదా విశ్వాసాలను స్వేచ్ఛగా వినియోగించుకునే హక్కులను కల్పించడం మానవాళి కనీస కర్తవ్యం. భావ ప్రకటన, మత విశ్వాసాలు పాటించడం, అభిప్రాయాలను వ్యక్తం చేయడం, శాంతియుతంగా సమావేశాలు నిర్వహించుకోవడం లాంటి అంశాలకు పూర్తి స్వేచ్ఛ కల్పించబడింది. ఒకరి మత విశ్వాసం మరొకరికి అడ్డు పడరాదు. ఇతరుల మత విశ్వాసాలను గౌరవించడం అలవాటు కావాలి. ఈ విధమైన పలు రకాల హక్కులు ప్రధానమైనవి, పరస్పరం బలీయమైనవి, ఒకదానితో మరొకటి సంబంధం కలిగి ఉన్నవి. ఇలాంటి హక్కులకు భంగం కలిగితే శాంతియుత వాతావరణం వేడెక్కి వివాదాస్పద హింసాత్మక ఘటనలకు దారి తీస్తాయి. ఇటీవల 22 ఏప్రిల్ 2025 రోజున పహెల్గామ్ దుర్ఘటనలో హిందూ మతస్తులపై పాకిస్థాన్ ముస్లిమ్ ఉగ్రవాదులు భయంకరమైన దాడి చేసి 26 మంది ప్రాణాలు బలిగొనడం చూసాం. ఈ దుర్ఘటన మతపరమైన హక్కులకు భంగం కలిగించడమే కాకుండా ఒక మతానికి చెందిన వారిని ఏరి కోరి కాల్చి వేయడం జరిగింది. ఈ తీవ్రవాదుల దుశ్చర్యకు ప్రతీకారంగా 07 మే 2025 రోజున భారత త్రివిధ దళాలు "ఆపరేషన్ సింధూర్" పేరుతో జరిపిన బాంబు దాడుల్లో పాకిస్థాన్ ఉగ్రవాద శిక్షణ కేంద్రాలు, మిలటరీ కేంద్రాలను ధ్వంసం చేయడంతో పాకిస్థాన్ చేతులు ఎత్తి, ఓటమిని అంగీకరించి, కాల్పుల విరమణ ప్రతిపాదన తేవడం జరిగింది.

మతం మానవత్వానికి అడ్డు కారాదు. విశ్వాసాలు మరొకరికి విశ్వాసాలకు భంగం కలిగించరాదు. ప్రపంచ మానవాళి శ్రేయస్సు కోరి మత విశ్వాసాలను వ్యక్తిగతంగా మాత్రమే పాటిస్తూ, మరొకరికి అడ్డు కాకుండా చూసుకోవాలి. పరమత సహనమే మంత్రంగా మన జీవితాలు సమైక్యతతో కొనసాగాలి. జాతి, కులం, మతం, విశ్వాసం, ఆచారం లాంటివి గౌరవించబడాలి. మన విశ్వాసాలు మరొకరి హక్కులకు భంగం కలిగించరాదని గమనించాలి. హింసాత్మక ఘటనలు సమాజ అస్థిరతకు కారణం అవుతాయి. పరస్పర పరమత సహనం మన నిత్య మంత్రం కావాలి. ఒకరి మతం మరొకరి విశ్వాసాలను వ్యతిరేకించరాదు. అన్నీ మరిచి మానవత్వమే సాధనంగా ప్రపంచ సమైక్యతకు పునాదులు వేయాలి, హింస లేని ప్రపంచం నిర్మించబడాలి.



-మధుపాలీ
9949700037

# ప్రాజెక్టుల మొత్తం అంచనా వ్యయం రూ. 9,450 కోట్లు...

## 2030-31 నాటికి పూర్తి చేయాలని లక్ష్యం

న్యూఢిల్లీ, ఆగష్టు 21:రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన నాలుగు ప్రాజెక్టులకు ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ రోజు సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. వీటి మొత్తం అంచనా వ్యయం దాదాపు 9,450 కోట్లు.

ఈ లైన్లలో సామర్థ్యం పెరగడం వల్ల రైళ్ల రాకపోకలు మెరుగుపడతాయి. ఇది భారతీయ రైల్వే రవాణా సామర్థ్యాన్ని, సేవల విశ్వసనీయతను బలోపేతం చేస్తుంది. ఈ మల్టీట్రాకింగ్ ప్రతిపాదనలు రైల్వే కార్యకలాపాలను క్రమబద్ధీకరించి, ట్రాఫిక్ రద్దీని తగ్గించనున్నాయి. ఈ ప్రాంతంలో సమగ్రాభివృద్ధిని సాధించడం ద్వారా... ప్రజలకు ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించి వారిని ఆత్మనిర్భరులుగా తీర్చిదిద్దాలన్న ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నవభారత దార్శనికతకు అనుగుణంగా ఈ ప్రాజెక్టులను చేపట్టారు.

సమగ్ర ప్రణాళిక, భాగస్వామ్య పక్షాల మధ్య సంప్రదింపుల ద్వారా.. బహువిధ రవాణా అనుసంధానాన్ని, లాజిస్టిక్స్ సామర్థ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో.. 'పీఎం గతిశక్తి జాతీయ బృహత్ప్రణాళిక' ఆధారంగా ఈ ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. ఎలాంటి ఆటంకం లేకుండా.. ప్రజలు, సరుకులు, సేవల రవాణాకు ఈ ప్రాజెక్టులు సదుపాయాన్ని కల్పిస్తాయి.

పశ్చిమ బెంగాల్, ఒడిశా, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని 8 జిల్లాల పరిధిలో ఉన్న ఈ నాలుగు ప్రాజెక్టుల ద్వారా భారతీయ రైల్వే నెట్‌వర్క్ దాదాపు మరో 410 కిలోమీటర్ల మేర విస్తరించనుంది. దాదాపు 60 లక్షల జనాభా ఉన్న దాదాపు 6,448 గ్రామాలకు.. మెరుగైన రైలు అనుసంధానాన్ని ఈ ప్రతిపాదిత మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులు అందిస్తాయి.

ఈ రైల్వే మార్గాల సామర్థ్యం పెంపు ద్వారా దేశంలో పలు ప్రసిద్ధ పర్యాటక, పుణ్యక్షేత్రాలకు రైలు అనుసంధానం గణనీయంగా మెరుగుపడనుంది. కుల్దిహా వన్యప్రాణుల అభయారణ్యం, భితరకనిక జాతీయ పార్కు, భద్రకాళీ దేవాలయం, ధమరాయ్ మాత దేవాలయం, పంచలింగేశ్వర ఆలయం, తాల్సరి - ఉదయ్‌పూర్, చాందీపూర్ బీచ్‌లతో పాటు.. పులికాట్ సరస్సు, నేలపట్టు పక్షుల అభయారణ్యం, వీరరాఘవ పెరుమాళ్ ప్రభు ఆలయం, గడ కుజంగ జగన్నాథాలయం, సరళా ఆలయం, ధబలేశ్వరాలయం, లలిత్‌గిరి వంటి ప్రముఖ బౌద్ధ క్షేత్రాలు వీటిలో ఉన్నాయి.

బొగ్గు, ఇనుప ఖనిజం, సిమెంటు, ఇనుము - ఉక్కు, కంటైనర్లు, వాహనాలు, ఆహార ధాన్యాల వంటి సరుకులను చేరవేసేందుకు ఈ ప్రతిపాదిత రైల్వే మార్గాలు అత్యంత ప్రయోజనకరంగా మారనున్నాయి. ఏటా అదనంగా 76 మిలియన్ టన్నుల సరుకు రవాణాకు ఈ మార్గాల విస్తరణతో అవకాశం కలుగుతుంది. పర్యావరణ అనుకూల, ఇంధన పొదుపునిచ్చే రైల్వే వ్యవస్థ ద్వారా.. దేశ వాతావరణ లక్ష్యాలను సాధించడంతోపాటు సరుకు రవాణా వ్యయాన్ని తగ్గించుకోవచ్చు. దీనివల్ల దాదాపు 13 కోట్ల లీటర్ల చమురు దిగుమతులు తగ్గి.. దాదాపు 65 కోట్ల కిలోల కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలు తగ్గుతాయి. దాదాపు 2.60 కోట్ల మొక్కలను నాటడం వల్ల కలిగే పర్యావరణ ప్రయోజనానికి ఇది సమానం.

# ప్రధాన రోడ్డుకు అడ్డంగా వంగిన చెట్టుతో పొంచి ఉన్న ప్రమాదం

ఆదిలాబాద్, ఆగష్టు 21: కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం పోచంలొద్ది గ్రామ సమీపంలోని పెద్ద వంతెనపై నుంచి ఓ చెట్టు ప్రధాన రోడ్డుకు అడ్డంగా వంగి ప్రమాదకరంగా మారింది. చెట్టు కొమ్మలు విరిగిన స్థితిలో ఉండటంతో వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపైకి చెట్టు కూలితే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు.

పోచంలొద్ది వంతెన వద్ద రోడ్డుకు అడ్డంగా వంగిన చెట్టును వెంటనే తొలగించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదం జరగక ముందే చెట్టును తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. లేనిపక్షంలో చెట్టు కారణంగా ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఎంఈఓ ఆశన్న సేవలు ప్రశంసనీయం



ఆదిలాబాద్, ఆగష్టు 21: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల విద్యాశాఖ అధికారి ఆరేపల్లి ఆశన్న రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందడం ఎంతో బాధాకరమని బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడిగా, ఎంఈఓగా ఆశన్న విద్యాభివృద్ధికి చేసిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఆశన్న మృతి విషయం తెలుసుకున్న జాన్సన్ నాయక్ గురువారం రాత్రి ఉట్నూర్‌లోని ఆయన నివాసానికి నాయకులతో కలిసి వెళ్లి ఆశన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఆశన్న ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో ఉట్నూర్ మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి అధ్యక్షుడు పంద్ర జైవంతరావు, మాజీ వైస్ ఎంపీపీ సలీమొద్దీన్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# శిథిలావస్థకు చేరిన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలతో ప్రజల ఇబ్బందులు

## -మున్సిపల్ శాఖ కార్యదర్శికి బీజేపీ కౌన్సిలర్ ఏతం శివకృష్ణ వినతి



ఆదిలాబాద్, ఆగష్టు 21:మంచిర్యాల జిల్లా చెన్నూరు మున్సిపాలిటీ 18వ వార్డులో నూతన రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని కోరుతూ బీజేపీ కౌన్సిలర్ ఏతం శివకృష్ణ హైదరాబాద్‌లో రాష్ట్ర మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకృష్ణ మాట్లాడుతూ.. వార్డులోని రోడ్లు, డ్రైనేజీలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాలనీలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే మంచిర్యాల జిల్లా కలెక్టర్, స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేసినట్లు చెప్పారు.

మంత్రి నియోజకవర్గ కేంద్రంగా ఉన్న చెన్నూరు మున్సిపాలిటీలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు పురాతనంగా మారాయని శివకృష్ణ తెలిపారు. 18వ వార్డుతో పాటు పట్టణంలో అవసరమైన చోట్ల నూతన రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవిని కోరినట్లు తెలిపారు.

# రక్షణ సహకారాన్ని మరింత బలోపేతం చేసేలా జపాన్ రక్షణ మంత్రితో న్యూఢిల్లీలో చర్చలు చేపట్టనున్న భారత రక్షణ మంత్రి

న్యూ ఢిల్లీ, ఆగష్టు 21:జపాన్ రక్షణ మంత్రి శ్రీ షింజిరో కోయిజుమితో 2026 ఆగస్టు 20న న్యూఢిల్లీలో రక్షణ మంత్రి శ్రీ రాజనాథ్ సింగ్ ద్వైపాక్షిక సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశం ద్వైపాక్షిక రక్షణ సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని, వ్యూహాత్మక విశ్వాసాన్ని, సహకారాన్ని మరింత పెంపొందిస్తుందని ఆశిస్తున్నారు. అలాగే ఇండో-పసిఫిక్ ప్రాంతంలో స్థిరత్వాన్ని, భద్రతను ప్రోత్సహించడంతో పాటు సహకారానికి కొత్త రంగాలను గుర్తిస్తుందని భావిస్తున్నారు.

రక్షణ పరికరాలు, సాంకేతిక పరిజ్ఞాన బదిలీకి సంబంధించిన మూడు సూత్రాలను జపాన్ సవరించిన నేపథ్యంలో 'మేక్-ఇన్-ఇండియా' విధానం ప్రకారం సముద్ర రక్షణ భద్రత సహకారాన్ని మరింత బలోపేతం చేయడం, రక్షణ పరికరాలు, సాంకేతిక సహకారంపై మంత్రులిద్దరూ తమ అభిప్రాయాలను పంచుకుంటారు. ద్వైపాక్షిక రక్షణ, భద్రత సహకారాన్ని ముందుకు తీసుకెళ్ల దానికి ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించడానికి ఈ సమావేశం ఒక అవకాశాన్ని అందిస్తుంది.

శ్రీ షింజిరో కోయిజుమి భారతదేశంలో తొలిసారి పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా 2026 ఆగస్టు 19న ముంబయిలోని పశ్చిమ నౌకాదళ కమాండ్‌ను సందర్శించారు. అక్కడ నౌకాదళ చీఫ్ స్టాఫ్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్, పశ్చిమ నౌకాదళ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ వాత్స్యాయన్‌తో చర్చలు నిర్వహించారు. భారత నావికాదళం పాత్ర, బాధ్యతల గురించి కార్యాచరణ సామర్థ్యాల గురించి ప్రతినిధి బృందానికి వివరించారు.

పశ్చిమ నౌకాదళ కమాండ్‌లో జపాన్ రక్షణ మంత్రి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అంతకుముందు నౌకాదళ డాక్‌యార్డులోని గౌరవ్ స్థంభ్ వద్ద పుష్ప గుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. దేశీయంగా నిర్మించిన నౌక ఐఎన్ఎస్ చెన్నైను కూడా సందర్శించారు.

స్వేచ్ఛాయుతమైన, అందరికీ అందుబాటులో ఉన్న, పటిష్టమైన, సుసంపన్నమైన ఇండో?పసిఫిక్ ప్రాంతాన్ని నిర్మించాలనే ఉమ్మడి దార్శనికతను భారత్, జపాన్ అనుసరిస్తున్నాయి. ద్వైపాక్షిక సహకారంలో పెరుగుతున్న వేగాన్ని జపాన్ రక్షణ మంత్రి రెండు రోజుల పర్యటన స్పష్టం చేస్తోంది. అలాగే భాగస్వామ్యాన్ని విస్తరించడంలో ఉభయపక్షాల నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.

# ఢిల్లీ 'ఐజీఐ' విమానాశ్రయంలో సరకు బదిలీ కార్యకలాపాలకు శ్రీకారం

న్యూ ఢిల్లీ, ఆగష్టు 21:ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ (ఐజీఐ) విమానాశ్రయం టెర్మినల్-2 వద్ద భారత సరకు బదిలీ (ట్రాన్స్ షిప్‌మెంట్ కార్గో-టీపీ) సంస్కరణ విస్తృత దశకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ రోజు శ్రీకారం చుట్టారు. 'ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం లిమిటెడ్' (డీఐఏఎల్) 'ట్రాన్స్‌షిప్‌మెంట్ ఎక్సలెన్స్ సెంటర్' (టీఈసీ) వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ- "ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వాన విమానయాన రంగంలో వాణిజ్య సౌలభ్యం బలోపేతానికి మేం నిరంతరం కృషి చేస్తున్నాం. ఇందులో భాగంగా పారిశ్రామిక రంగం సూచన మేరకు సరకు బదిలీ ప్రక్రియలో దీర్ఘకాలం నుంచీ కొనసాగుతున్న 'తప్పనిసరి పునఃతనిఖీ' నిబంధన తీవ్ర జాప్యానికి దారితీస్తున్నట్లు గుర్తించాం. సరకు రవాణా వేగానికి తీవ్ర అవరోధంగా మారిన ఈ విధానాన్ని ఇప్పుడు పూర్తిగా రద్దుచేశాం. తద్వారా సరకు బదిలీ కూడళ్ల వద్ద రద్దీ సహా చేరవేత సమయాన్ని, నిర్వహణ ఖర్చులను గణనీయంగా తగ్గించవచ్చు. ఈ భావన (పీఓసీ)ను చెన్నై-ఢిల్లీ-ఫ్రాంక్‌ఫర్ట్ మార్గంలో ప్రయోగాత్మకంగా ఆచరణలోకి తెచ్చినపుడు నిర్దేశిత గమ్యానికి సగటు రవాణా సమయం 60 నుంచి 20 గంటలకు తగ్గింది" అని వివరించారు.

ఈ ఏడాది జూన్ 20న చెన్నై-ఢిల్లీ-ఫ్రాంక్‌ఫర్ట్ సెక్టార్‌లో 'డీఐఏఎల్' పరిధిలోని 'టీఈసీ' నుంచి ఎయిరిండియా ద్వారా జాతీయ, అంతర్జాతీయ సరకు బదిలీ 'పీఓసీ'ని ప్రారంభించారు. అప్పటి నుంచి 280 టన్నుల సరకులు బదిలీ కాగా, విమాన సరకు రవాణా సామర్థ్య వినియోగం 75 నుంచి దాదాపు 100శాతానికి పెరిగింది.

ఈ విజయం ఆధారంగా ఇవాళ దేశంలోని మరో 4 కీలక కేంద్రాలు- బెంగళూరు, అహ్మదాబాద్, ముంబై, హైదరాబాద్ సహా 2 కొత్త అంతర్జాతీయ విమానాశ్రయాలు- లండన్, కోపెన్‌హాగన్‌లకు ఈ నెట్‌వర్కును విస్తరించారు. దీనివవల్ల ఈ మార్గాల్లో ఎయిరిండియా నెలవారీ సరకు రవాణా సామర్థ్యం 1,763 నుంచి 3,183 టన్నులకు.. అంటే- దాదాపు 80 శాతం పెరుగుతుందని అంచనా.

శ్రీ రామ్మోహన్ నాయుడు తన ప్రసంగం కొనసాగిస్తూ- "మరో 4 ప్రధాన దేశీయ సరకు మార్కెట్లు, 2 కొత్త అంతర్జాతీయ గమ్యాల అనుసంధానం ద్వారా ఈ విజయవంతమైన నమూనాను ఇప్పుడు మరింత విస్తరిస్తున్నాం. జాతీయ-అంతర్జాతీయ విమాన రవాణాపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించింది. అయితే, తూర్పు-పశ్చిమ దేశాల మధ్యగల మన వ్యూహాత్మక స్థానాన్ని సద్వినియోగం చేసుకుంటూ భారత్‌ను అంతర్జాతీయ సరకు బదిలీ కూడలిగా నిలపాలని లక్ష్యనిర్దేశం చేసుకున్నాం. అనంతరం ఈ వ్యవస్థను అంతరాజ్జతీయ-అంతర్జాతీయ, అంతరాజ్జతీయ-దేశీయ రవాణాకూ విస్తరిస్తాం" అని తెలిపారు.

అలాగే, "దేశంలోని ప్రధాన విమానాశ్రయాలను ప్రపంచ రవాణా కూడళ్లుగా రూపొందించాలన్న ప్రభుత్వ విస్తృత దృక్కోణంలో ప్రస్తుత సంస్కరణ ఒక భాగం. ప్రయాణికుల కోసం 'హబ్ అండ్ స్పోక్' కార్యకలాపాల బలోపేతం చేశాక, భారత విమాన రవాణా కేంద్రాల సామర్థ్యం పెంచేందుకు ప్రభుత్వం ఇప్పుడు ఇలాంటి చర్యలు చేపడుతోంది'' అని ఆయన పేర్కొన్నారు.

లోగడ 'బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ' (బీసీఏఎస్) ద్వారా 2025 జూలై 21న 'ఏవీఎస్ఈసీ సర్క్యులర్ నం. 6/2024'కు అనుబంధం-ఎఎ ద్వారా ఈ చట్రాన్ని సవరించారు. దీని ప్రకారం- నిర్దిష్ట భద్రత చర్యలకు అనుగుణంగా ప్రత్యేక సరకు బదిలీ భద్రత నిర్వహణ ప్రదేశాల ద్వారా సురక్షిత బదిలీ సరకులను పునఃతనిఖీ లేకుండా తరలించేందుకు అనుమతి ఇచ్చారు.

భారత విమాన సరకు రవాణా వ్యవస్థ పోటీతత్వం మెరుగుదల సహా ఓ కీలక ఆటంకం తొలగింపులో కృషితోపాటు ఆచరణాత్మక ప్రయోగ విజయంలో పాలుపంచుకున్న 'డీఐఏఎల్, బీసీఏఎస్, సీఐఎన్ఎఫ్', విమానయాన సంస్థలు, కస్టమ్స్ విభాగం సహా భాగస్వాములందరికీ మంత్రి ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

ఈ నేపథ్యంలో త్వరలోనే అదనపు ప్రధాన కూడళ్లు, అంతర్జాతీయ గమ్యాలను కూడా దీని పరిధిలోకి తేవాలని మంత్రిత్వశాఖ యోచిస్తోంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా పోటీపడగల విమానయాన, సరకు రవాణా కూడలిగా భారత్ స్థానం మరింత పటిష్టమవుతుంది.

ఈ కార్యక్రమంలో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ సమీర్ కుమార్ సిన్హా, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ శ్రీ విపిన్ కుమార్, మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ అసంగ్బా చుబా ఆవో పాల్గొన్నారు. అలాగే, బీసీఏఎస్ సంయుక్త డైరెక్టర్ జనరల్ శ్రీమతి ప్రతిభా అంబేద్కర్ సహా ఏంఓసీఏ, ఏఏఐ, బీసీఏఎస్, డీఐఏఎల్, ఎయిరిండియా తదితర భాగస్వామ్య సంస్థల సీనియర్ అధికారులు కూడా హాజరయ్యారు.

# రామగుండం అభివృద్ధిపై సమీక్ష

## -వైఎస్సార్ ఇండ్ల పట్టాల మంజూరుపై చర్చ

కరీంనగర్, ఆగష్టు 21: రామగుండం నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్‌ఠాకూర్ గురువారం సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి వివిధ అంశాలపై చర్చించారు.

ఈ సమావేశంలో సింగరేణి స్థలాల్లో గత కొన్నేళ్లుగా ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న ప్రజలకు వైఎస్సార్ ఇండ్ల పట్టాల మంజూరు అంశంపై ప్రధానంగా చర్చ జరిగింది. అలాగే రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షించారు.

కార్పొరేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, భూ సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులను వేగవంతం చేసే అంశాలపై ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, కలెక్టర్ కోయ శ్రీహర్ష చర్చించారు.



ఈ సమావేశంలో మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతిపల్లి ఎల్లయ్య, సింగరేణి జీఎం డి. లలిత్‌కుమార్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ఉన్నత స్థాయి ప్రభుత్వ, వాణిజ్య సమావేశాల్లో పాల్గొన్న శ్రీ గోయల్..

న్యూఢిల్లీ, ఆగష్టు 21:భారత్, సింగపూర్ మంత్రుల స్థాయి రౌండ్‌టేబుల్ (ఐఎస్ఎమ్ఆర్) ప్రాథమిక ప్రణాళికలో భాగంగా ఉన్నత స్థాయి సహకారాన్ని నిరంతరాయంగా కొనసాగించడానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ నేటి నుంచి ఈ నెల 21 వరకు సింగపూర్‌లో పర్యటిస్తున్నారు.

భారత్, సింగపూర్ ఆర్థిక, వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి వివిధ రంగాలకు చెందిన దాదాపు 70 మంది సీనియర్ వాణిజ్య ప్రముఖులతో కూడాన ఒక భారతీయ ప్రతినిధి వర్గం శ్రీ పీయూష్ గోయల్‌తో కలిసి సింగపూర్ వెళ్తోంది. ప్రతినిధి వర్గంలో సాంకేతికత, సాఫ్ట్‌వేర్, కృత్రిమ మేధ (ఏఐ), తయారీ, ఇంజినీరింగ్, మౌలిక సదుపాయాల కల్పన, స్థిరత్వం, ఆర్థిక సహాయ సేవలు, ఫిన్‌టెక్, ఆరోగ్యసంరక్షణ, లైఫ్ సైన్సెస్, ఆహారం, వ్యవసాయం, ఆధునిక వస్త్రరవాణా వ్యవస్థ, నౌకావాణిజ్యం, వ్యాపార రంగాలకు చెందిన వారితో పాటు వృత్తిప్రధాన సేవల రంగాలకు చెందిన వారు కూడా ఉన్నారు.

ఈ ప్రతినిధి వర్గం బీ2బీ, జీ2బీ, సంస్థాగత స్థాయికి సంబంధించిన అనేక కార్య కలాపాల్లో పాలుపంచు కొంటుంది. ప్రముఖ ప్రావీణ్య కేంద్రాలు (సీఓఈ)తో మాటామంతీతో పాటు సింగపూర్ నైపుణ్య ప్రదాన సంస్థలను ప్రతినిధి వర్గం సందర్శిస్తుంది. భాగస్వామ్యం, పెట్టుబడి, మార్కెట్ లభ్యత, సాంకేతిక సహకారం, ప్రతిభకు పదును పెట్టడంపై దృష్టి సారించడం ఈ కార్యక్రమాల ముఖ్యోద్దేశం. ఈ పర్యటన కార్యక్రమాన్ని భారత్, సింగపూర్ మంత్రుల స్థాయి రౌండ్‌టేబుల్ సమావేశం, భారత్ సింగపూర్ వాణిజ్య రౌండ్‌టేబుల్ సమావేశాలకు సమానాంతరంగా ఏర్పాటు చేశారు.

పర్యటన కాలంలో శ్రీ పీయూష్ గోయల్ రేపు, అంటే ఈ నెల 20న భారత్, సింగపూర్ మంత్రుల స్థాయి నాలుగో రౌండ్‌టేబుల్ (ఐఎస్ఎమ్ఆర్) సమావేశంలో పాల్గొంటారు. భారత్, సింగపూర్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని (సీఎస్‌పీ) ముందుకు తీసుకుపోవడానికి ఉద్దేశించిన మంత్రుల స్థాయి సర్వోన్నత యంత్రాంగమే ఐఎస్ఎమ్ఆర్. ఈ రౌండ్‌టేబుల్ సమావేశాన్ని భారత్, సింగపూర్ వాణిజ్య సంబంధిత నాలుగో రౌండ్‌టేబుల్ సమావేశం (ఐఎస్‌బీఆర్)తో పాటే నిర్వహిస్తారు. దీని తరువాత అవగాహన ఒప్పందం (ఎమ్ఓయూ)పై సంతకాల కార్యక్రమం ఉంటుంది. ఇది పూర్తి అయ్యాక ఐఎస్ఎమ్ఆర్, ఐఎస్‌బీఆర్ ప్రతినిధులందరికీ సింగపూర్ ఉప ప్రధాని ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో మంత్రితో పాటు కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్, కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ సుబ్రహ్మణ్యం జైశంకర్, కేంద్ర రైల్వేలు, సమాచార, ప్రసార శాఖ, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికత శాఖ మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ కూడా పాల్గొంటారు. ఈ పర్యటన కాలంలో మంత్రులు సింగపూర్‌లో తమ శాఖల బాధ్యతలనే నిర్వహిస్తున్న మంత్రులతోనూ, ఇతర సీనియర్ నేతలతోనూ చర్చిస్తారు.

శ్రీ పీయూష్ గోయల్ ఇస్తానాలో సింగపూర్ ప్రధాని శ్రీ లారెన్స్ వోంగ్‌తోనూ భేటీ అవుతారు.

దీంతో పాటు శ్రీ గోయల్.. గ్లోబల్ ఫైనాన్స్ అండ్ టెక్నాలజీ నెట్‌వర్క్, వైపీఓ గ్లోబల్, మిల్కెన్ ఇనిస్టిట్యూట్, కెప్పెల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, టెమాసెక్ హోల్డింగ్స్, ఐహెచ్‌హెచ్ హెల్త్‌కేర్‌ల సీనియర్ ప్రతినిధులు, సింగపూర్ బిజినెస్ ఫెడరేషన్ (ఎస్‌బీఎఫ్) చైర్మన్ నాయకత్వంలోని ప్రతినిధి వర్గం, టర్నర్ అండ్ టౌన్‌సెండ్ , ఎస్‌టీటీ జీడీసీ, ఇంకా గవర్నమెంట్-టు-బిజినెస్ (జీ2బీ) సమావేశాలలో కూడా పాల్గొంటారు. ఈ సమావేశాలకు తరువాయిగా ఫ్యామిలీ ఆఫీస్ రౌండ్‌టేబుల్ కార్యక్రమం ఉంటుంది.

మంత్రి.. సింగపూర్ విదేశీ వ్యవహారాలు, వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి అయిన గాన్ సియో హ్యువాంగ్‌తో పాటు సిటీ స్క్వేర్ మాల్‌లో'అపెడా'-ఫేర్‌ప్రైస్ స్టోర్‌ను సందర్శిస్తారు. భారతీయ వ్యావసాయిక ఆహార పదార్థాల ఎగుమతులను ప్రోత్సహించడం, సింగపూర్ రిటైల్ మార్కెట్లులో వాటి విస్తృతికి దోహదం చేయడం ఈ స్టోర్ ఉద్దేశం. రెండు దేశాల మధ్య వ్యవసాయ, వ్యాపార సంబంధాలను ఈ స్టోర్ పటిష్ఠపరుస్తోంది.

ఐఎన్ఎస్ఈఏడీ ఆసియా క్యాంపస్‌లో ఎఫ్ఐసీసీఐ ఏర్పాటు చేసే భారత్, సింగపూర్ బిజినెస్ ఫోరమ్‌లోనూ శ్రీ పీయూష్ గోయల్ పాల్గొంటారు. అక్కడ "కొత్త అంతర్జాతీయ అభివృద్ధి సమీకరణంలో భారత్: ఆసియాలోనూ, ప్రపంచంలోనూ వాణిజ్యనికి ఉన్న అవకాశం, అభివృద్ధి" అంశంపై ఇష్టాగోష్ఠిలో ఆయన పాలుపంచుకుంటారు. తరువాత, భారత్ సింగపూర్ వాణిజ్య సముదాయంతో నెట్‌వర్కింగ్ డిన్నర్ ఉంటుంది.

పర్యటన చివర్లో మెరీనా బే శాండ్స్ ఎక్స్‌పో అండ్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించే '2026 ఐసీఏఐ ఆసియాన్ సమావేశం'లో మంత్రి కీలకోపన్యాసమిస్తారు.

భారత్‌కు సింగపూర్ కీలకమైన ఆర్థిక భాగస్వామి. ప్రధాన పెట్టుబడిదారు కూడా. 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత్‌లో సింగపూర్ 19.8 బిలియన్ అమెరికా డాలర్ల విలువైన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) పెట్టింది. ఏదైనా విదేశం నుంచి భారత్‌కు భారీ స్థాయిలో తరలివచ్చిన ఎఫ్‌డీఐ ఇదే. 2000 ఏప్రిల్ మొదలు ఈ ఏడాది మార్చి నెల మధ్య కాలంలో సింగపూర్ నుంచి 194.68 బిలియన్ అమెరికా డాలర్ల విలువైన ఎఫ్‌డీఐ వచ్చింది. ఇది భారత్ అందుకున్న మొత్తం ఎఫ్‌డీఐలో 24.72 శాతం. ఆసియాన్ పరిధిలో భారత్‌కు అతి పెద్ద వాణిజ్య భాగస్వామి కూడా సింగపూర్‌యే. విదేశీ వాణిజ్య రుణాలే కాకుండా విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులకు కూడా సింగపూర్ ప్రధాన వనరుగా ఉంటోంది. భారత్, సింగపూర్ సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందం (సీఈపీఏ) కుదిరిన తరువాత ద్వైపాక్షిక వాణిజ్యం చెప్పుకోదగిన స్థాయిలో విస్తరించింది. ఇది 2004-05 ఆర్థిక సంవత్సరంలో 6.7 బిలియన్ అమెరికా డాలర్ల స్థాయి నుంచి, 2025-26 ఆర్థిక సంవత్సరంలో 36.1 బిలియన్ అమెరికా డాలర్ల స్థాయికి చేరుకొంది. సింగపూర్‌తో వాణిజ్యం, పెట్టుబడితో పాటు రెండు దేశాల ప్రజల పరస్పర సంబంధాలను కూడా పటిష్ట పరుచుకోవడానికి భారత్ కనబరుస్తున్న నిబద్ధతను ఈ పర్యటన పునరుద్ఘాటిస్తుంది. భారత్‌కు ఎఫ్‌డీఐల రంగంలో సింగపూర్ అతి పెద్ద వనరుగానే కాకుండా ఆధునిక తయారీ రంగం, డిజిటలీకరణ, నైపుణ్యాల అభివృద్ధితో పాటు హరిత ఆర్థిక వ్యవస్థలో ఓ కీలక భాగస్వామిగా కూడా ఉంది.

## ఏనుగు దంతపు వస్తువుల అక్రమ రవాణా ముఠా ప్రయత్నాలను భగ్నం చేసిన డీఆర్ఐ

న్యూఢిల్లీ, ఆగష్టు 21:డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) ఈ రోజు నిర్వహించిన సోదాల్లో, వన్యప్రాణుల అక్రమ రవాణా సిండికేట్‌ను ఛేదించింది. ఏనుగు దంతాలపై అత్యంత అద్భుతంగా రూపొందించిన 54 కళాఖండాలను స్వాధీనం చేసుకుంది.

ఏనుగు దంతాల కళాఖండాల అక్రమ వ్యాపారానికి సంబంధించి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు, డీఆర్ఐ అధికారులు లక్నోలో సోదాలు నిర్వహించారు. వన్యప్రాణుల సంబంధిత వస్తువుల అక్రమ రవాణ వ్యాపారంలో పాలుపంచుకుంటున్న ఒక సిండికేట్‌కు చెందిన నలుగురిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఏనుగు దంతాలతో అత్యంత సుందరంగా రూపొందించిన 54 కళాఖండాలనూ స్వాధీనం చేసుకున్నారు.

స్వాధీనం చేసుకున్న కళాఖండాల్లో ఎద్దు, ఏనుగు, శునకం వంటి జంతువుల బొమ్మలు... యోధుడు, బిడ్డను హత్తుకున్న తల్లి వంటి మానవ సంబంధిత బొమ్మలు... కత్తెర, దువ్వెన, అగరుబత్తి స్టాండ్, కుంకుమ భరిణె వంటి ఇతర వస్తువుల కళారూపాలూ ఉన్నాయి. ఏనుగు దంతాలతో తయారు చేసిన ఈ కళాఖండాలు అత్యంత సుందరంగా, చక్కటి కళా నైపుణ్యంతో రూపొందించినవి. వాణిజ్య పరంగా, పురాతన కళాఖండాలుగా ఇవి అత్యంత విలువ గలవి. స్వాధీనం చేసుకున్న ఏనుగు దంతాల కళాఖండాలనూ, అదుపులోకి తీసుకున్న నలుగురు సిండికేట్ సభ్యులనూ తదుపరి విచారణ కోసం యూపీ అటవీ శాఖకు అప్పగించారు.

అంతరించిపోతున్న వన్యప్రాణులు, వృక్షజాతుల అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందం (సీఐటీఈఎస్) కింద భారత్ కలిగి ఉన్న అంతర్జాతీయ బాధ్యతలకు అనుగుణంగా... వన్యప్రాణి (సంరక్షణ) చట్టం-1972 సహా ఇతర నిబంధనల ప్రకారం ఏనుగు దంతం, దానితో తయారు చేసిన వస్తువుల వాణిజ్యం నిషేధం.

# ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యను తీవ్రంగా ఖండిస్తున్నాం

## విద్యార్థుల ప్రవర్తనపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలి: ప్రదీప్‌రెడ్డి



నల్గొండ, ఆగష్టు 21::నల్గొండ జిల్లాలో జరిగిన ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు కాకతీయ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రదీప్‌రెడ్డి అన్నారు. గురువారం మంథని పట్టణంలోని కాకతీయ పాఠశాలలో రూపారెడ్డి హత్య ఘటనకు నిరసనగా ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించారు. అనంతరం ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రవర్తనపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. నేటి సమాజంలో విద్యార్థులు అశాంతి, అసాంఘిక కార్యకలాపాల వైపు వెళ్లడం ఆవేదన కలిగిస్తోందని పేర్కొన్నారు.

విద్యార్థులు తమ జీవిత అభివృద్ధిపై దృష్టి సారించాలని, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.

తప్పు చేసిన వారికి చట్టపరంగా శిక్షలు ఉంటాయని గుర్తుంచుకోవాలని అన్నారు. సన్మార్గంలో నడుస్తూ జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని, చదువుపైనే శ్రద్ధ పెట్టాలని విద్యార్థులకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇంటి స్థలాల కోసం 22 నుంచి టీడబ్ల్యూజేఎఫ్ పాదయాత్ర

## -షోయబుల్లాఖాన్ వర్ధంతి రోజున సుబ్లేడు నుంచి ప్రారంభం

## -15 రోజుల పాటు జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో యాత్ర




ఖమ్మం, ఆగష్టు 21:జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలనే డిమాండ్‌తో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి ఖమ్మం జిల్లాలో పాదయాత్ర చేపట్టనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి తెలిపారు. జర్నలిస్టు అమరుడు షోయబుల్లాఖాన్ వర్ధంతి సందర్భంగా ఆయన స్వస్థలమైన తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు గ్రామంలోని విగ్రహం వద్ద నుంచి యాత్ర ప్రారంభమవుతుందని వెల్లడించారు.

ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈ పాదయాత్ర ఏ రాజకీయ పార్టీకి, ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. జర్నలిస్టులకు గత ప్రభుత్వాలు ఇచ్చిన ఇంటి స్థలాల హామీని గుర్తు చేయడం, దాన్ని అమలు చేయాలని కోరడమే యాత్ర ప్రధాన ఉద్దేశమన్నారు.

జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో సుమారు 15 రోజుల పాటు పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. ప్రతి మండల కేంద్రంలోని తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. తొలిరోజు సుబ్లేడు నుంచి తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మం రూరల్ మండల కేంద్రాల వరకు యాత్ర నిర్వహిస్తామన్నారు.

ఆయా ప్రాంతాల్లో జర్నలిస్టులతో సమావేశాలు నిర్వహించి ఇంటి స్థలాల సమస్యను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. చాలీచాలని వేతనాలు, ఆర్థిక ఇబ్బందులతో అద్దెలు చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్న జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. గత, ప్రస్తుత ప్రభుత్వాలు జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చినా అవి ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు.

యూనియన్లు, రాజకీయాలకు అతీతంగా ఈ పాదయాత్ర కొనసాగుతుందని, దీనికి రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా మద్దతు ఇవ్వాలని కోరారు. జర్నలిస్టులందరూ యూనియన్ భేదాలకు అతీతంగా పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వృత్తి బాధ్యతలకు ఇబ్బంది కలగకుండా పరిస్థితులకు అనుగుణంగా విరామాలు ఇస్తూ పాదయాత్ర కొనసాగిస్తామని తెలిపారు. సమావేశంలో ఖమ్మం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు దగ్గుబాటి మాధవరావు, స్టేట్ ఈసీ సభ్యుడు చక్రవర్తి, సీనియర్ జర్నలిస్ట నాగేందర్‌రెడ్డి, టీబీజేఏ జిల్లా అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు జానీపాషా, ఖమ్మం నియోజకవర్గ కార్యదర్శి గరిడేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఖానాపురం ఫ్రూట్ మార్కెట్‌కు రూ.17.72 కోట్లు

## -మంత్రి తుమ్మలకు పండ్ల వ్యాపారుల కృతజ్ఞతలు




ఖమ్మం, ఆగష్టు 21:ఖానాపురం ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ యార్డు అభివృద్ధికి రూ.17.72 కోట్ల నిధులు మంజూరు చేయించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు పండ్ల వ్యాపారులు కృతజ్ఞతలు తెలిపారు. ఖానాపురం హవేలీలోని మార్కెట్ యార్డు వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఎంసీ చైర్మన్ హనుమంతరావు, కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ అశ్రీఫ్ మాట్లాడారు.

మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవతో నిలిచిపోయిన మార్కెట్ యార్డు పనులు తిరిగి ప్రారంభమయ్యాయని వారు తెలిపారు. అనంతరం ఫ్రూట్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మార్కెట్ యార్డు నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోవడంతో పండ్ల వ్యాపారులు రోడ్లపైనే వ్యాపారాలు నిర్వహిస్తూ ఇబ్బందులు ఎదుర్కొన్నారని అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ జానిమియా, కార్యదర్శి ఏటుకూరి శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడు గరగ శ్రీనివాస్ తెలిపారు.

మంజూరైన నిధులతో మార్కెట్ యార్డులో 31 అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌లు, ట్రేడర్స్ షాపులు, కవర్ షెడ్లు, ఎలక్ట్రానిక్ వెయింగ్ బ్రిడ్జి, రైతుల విశ్రాంతి భవనం, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు వంటి మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు.

మార్కెట్ యార్డు పూర్తయితే రోడ్లపై పండ్ల విక్రయాలకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు రైతులు, వ్యాపారులు, వినియోగదారులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్రూట్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# వినూత్నంగా మొక్కజొన్నలో దాచి 56 కిలోల మెథాంఫేటమైన్‌ను అక్రమంగా తరలించే ప్రయత్నాన్ని భగ్నం చేసిన డీఆర్ఐ... ఇద్దరి అరెస్టు

న్యూ ఢిల్లీ, ఆగష్టు 21:అంతర్జాతీయంగా మాదక ద్రవ్యాలు, సైకోట్రోపిక్ పదార్థాల అక్రమ రవాణాను అడ్డుకోవడంలో తన నిరంతర కృషిని కొనసాగిస్తూ... భారత్ నుంచి సౌదీ అరేబియాకు గణనీయ పరిమాణంలో అక్రమంగా మెథాంఫేటమైన్‌ను తరలించే ప్రయత్నాన్ని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) భగ్నం చేసింది.

ఈ నెల 16, 17 తేదీల్లో డీఆర్ఐ నిర్వహించిన ఒక నిఘా ఆధారిత ఆపరేషన్‌లో... నవశేవా పోర్టు ద్వారా ఎగుమతి చేసేందుకు ప్రయత్నిస్తున్న సరుకు నుంచి పొడి రూపంలో ఉన్న సుమారు 56 కిలోల మెథాంఫేటమైన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సరుకు గల 351 సంచుల్లోని ఒకదానిలో ఈ నిషేధిత మాదకద్రవ్యాన్ని చాకచక్యంగా మొక్కజొన్నతో కలిపి ఉంచారు. స్వాధీనం చేసుకున్న మెథాంఫేటమైన్‌ను నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) చట్టం-1985 నిబంధనల ప్రకారం జప్తు చేశారు.

వేగంగా జరిగిన దర్యాప్తులో, ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న ఎగుమతిదారు, రవాణాదారులను గుర్తించారు. ఎగుమతి సరుకు రవాణ, కస్టమ్స్ క్లియరెన్స్ కోసం ఆ రవాణాదారు విదేశీ కొనుగోలుదారుతో సమన్వయం చేసుకుంటున్నట్లు దర్యాప్తులో తేలింది. అక్రమ రవాణా ప్రయత్నంలో వారి పాత్రల ఆధారంగా, ఎన్‌డీపీఎస్ చట్టం-1985 నిబంధనల కింద ఆ ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు.

దాచి ఉంచిన విధానం అధిక పరిమాణంలో మెథాంఫేటమైన్‌ను మొక్కజొన్నతో విడదీయలేని విధంగా కలిపి ఉంచారు. ఆ నరుకును ఒక సాధారణ వ్యవసాయ ఉత్పత్తిగా మభ్యపెట్టి, ఎగుమతి సమయంలో జరిగే సాధారణ తనిఖీ, గుర్తింపును తప్పించుకోవడానికి ఉద్దేశించిన ఒక విలక్షణమైన విధానాన్ని ఈ ప్రయత్నం సూచిస్తోంది.

మెథాంఫేటమైన్ ప్రత్యేకించి దుర్వినియోగం, వ్యసనానికి అధిక అవకాశం ఉన్న అత్యంత శక్తిమంతమైన కృత్రిమ మానసిక ఉత్తేజిత పదార్థం. దీని వాడకం వల్ల హృదయ స్పందన రేటు పెరగడం, అధిక రక్తపోటు, ఆందోళన, భ్రాంతి, మానసిక రుగ్మత సహా ఇతర తీవ్రమైన ఆరోగ్య సమస్యలు, తీవ్రమైన శారీరక, మానసిక దుష్ప్రభావాలూ కలుగుతాయి. దీర్ఘకాలిక లేదా పునరావృత వాడకం వల్ల మాదకద్రవ్యాలు వ్యసనంగా మారడంతో పాటు ఆరోగ్యం, పనితీరు గణనీయంగా దెబ్బతినే అవకాశం ఉంది.

# బ్రిక్స్ భారతదేశ అధ్యక్షతన ఎనిమిదో బ్రిక్స్ యువ శక్తి సదస్సు-2026 బ్రిక్స్ ఇంధన సహకారానికి యువతే కేంద్రం

న్యూ ఢిల్లీ, ఆగష్టు 21:బ్రిక్స్ భారతదేశ అధ్యక్షతన ఆగస్టు 17, 2026న ఎనిమిదో బ్రిక్స్ యువ శక్తి సదస్సు-2026 వర్చువల్ విధానంలో జరిగింది. విద్యా సంస్థలు, ప్రభుత్వ సంస్థలు, బ్రిక్స్ సభ్యదేశాల విద్యుత్ మంత్రిత్వ శాఖల యువ నిపుణులతో సహా 100 మందికిపైగా ప్రతినిధులు హాజరయ్యారు. బ్రిక్స్ యువ శక్తి ఏజెన్సీ (బ్రిక్స్ వైఈఏ) ప్రతినిధులతో పాటు అందరికీ సుస్థిర ఇంధనం (ఎస్ఈఫర్ఆల్), అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఏ), అంతర్జాతీయ పునరుత్పాదక ఇంధన సంస్థ (ఐఆర్ఈఎన్ఏ) వంటి అంతర్జాతీయ సంస్థల నుంచి ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

''పటిష్ఠత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరతతో కూడిన నిర్మాణం" ఇతివృత్తమే మార్గదర్శకంగా బ్రిక్స్-2026కు భారత్ అధ్యక్షత వహిస్తుంది. విద్యుత్ రంగానికి సంబంధించి బ్రిక్స్ దేశాలన్నింటిలో సార్వత్రిక, సరసమైన ధరలో, సమ్మిళిత శక్తి లభ్యతను పెంపొందించాలనే నిబద్ధతను తెలియజేస్తూ.. "అందరికీ ఇంధనం" నినాదాన్ని భారత్ పాటిస్తుంది.

బ్రిక్స్ విద్యుత్ సహకారంలో ఈ సదస్సు యువతకు అగ్రస్థానం ఇచ్చింది. ఆవిష్కరణలు, వ్యవస్థాపకత, సాంకేతిక పురోగతి, అంతర్జాతీయ సహకారంలో యువత పాత్రను గుర్తించింది. బ్రిక్స్ దేశాల్లోని యువ నిపుణులు, విద్యావేత్తలు, ప్రభుత్వ సంస్థలు, పరిశ్రమల మధ్య పరస్పర సహ కారాన్ని బలోపేతం చేయాల్సిన ప్రాముఖ్యతను ఈ చర్చలు స్పష్టం చేశాయి.

ఉమ్మడి పరిశోధనలు, సాంకేతిక ప్రదర్శనలు, విజ్ఞాన మార్పిడి, సామర్థ్య పెంపుదల కార్యక్రమాల ద్వారా యువత భాగస్వామ్యాన్ని ఆచరణాత్మక ఫలితాలుగా మార్చటంలోని ప్రాముఖ్యతను ఈ చర్చలు స్పష్టం చేశాయి. ఇంధన భద్రత, సుస్థిరత ఇంధన లభ్యత, సమానత్వం సాంకేతికత, ఆవిష్కరణ వంటి మూడు ప్రధాన రంగాల ద్వారా 20 మందికిపైగా యువవక్తలు పలు కీలక అంశాలపై దేశాల దృక్పథాలను, అనుభవాలను పంచుకున్నారు. వైవిధ్యమైన ఇంధన మిశ్రమం, ఇంధన సరఫరా వ్యవస్థల స్థిరత్వం, ఇంధన లభ్యత, వినూత్న ఆర్థిక సహాయం, నూతన, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, ఇంధన వ్యవస్థల డిజిటలైజేషన్ వంటి కీలక అంశాలపై చర్చించారు.

స్వచ్ఛ ఇంధన విస్తరణను ముందుకు తీసుకెళ్లేందుకు శక్తిమంతమైన, వైవిధ్యభరితమైన ఇంధన వ్యవస్థలు, అందరికీ అందుబాటులో ఉండే, సమ్మిళిత ఇంధన వసతి, వినూత్నమైన, సరసమైన ధరల్లో లభించే ఆర్థిక వనరుల అవసరంపై ఈ చర్చల్లో విస్తృతంగా ఏకాభిప్రాయం వ్యక్తమైంది. సమర్థవంతమైన, సౌకర్యవంతమైన, పటిష్ఠమైన ఇంధన వ్యవస్థలను రూపొందించటంలో సాంకేతిక ఆవిష్కరణలు, డిజిటలైజేషన్‌ను కీలక సాధనాలుగా గుర్తించారు.

# ప్రభుత్వ పరిపాలన, పాలనా సంస్కరణల రంగంలో సహకారంపై భారత్ - మలేషియా రెండో సంయుక్త కార్యబృంద సమావేశం

న్యూ ఢిల్లీ, ఆగష్టు 21:'ప్రభుత్వ పరిపాలన, పాలనా సంస్కరణల రంగంలో సహకారం'పై రెండో భారత్ - మలేషియా సంయుక్త కార్యబృంద (జేడబ్ల్యూజీ) సమావేశాన్ని 2026 ఆగస్టు 18న నిర్వహించారు. పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ (డీఏఆర్పీజీ) అదనపు కార్యదర్శి శ్రీ పునీత్ యాదవ్, మలేషియా ప్రభుత్వ సేవల (అభివృద్ధి) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ దాతుక్ డాక్టర్ మహమ్మద్ బఖారీ బిన్ ఇస్మాయిల్ ఈ సమావేశానికి సంయుక్తంగా అధ్యక్షత వహించారు. భారత్ తరఫున డీఏఆర్పీజీ, విదేశాంగ మంత్రిత్వ శాఖ (కౌలాలం పూర్ లోని భారత హైకమిషన్ సహా), జాతీయ సుపరిపాలన కేంద్రం (ఎన్‌సీజీజీ) ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మలేషియా ప్రతినిధి బృందానికి స్వాగతం పలుకుతూ శ్రీ పునీత్ యాదవ్ ప్రసంగించారు. భారత్ - మలేషియా మధ్య దీర్ఘకాలిక, బహుముఖ సంబంధాలకు.. బలమైన ప్రజా సంబంధాలు, ఉమ్మడి విలువలు, పరస్పర ప్రయోజనాలు ప్రాతిపదికగా నిలిచాయని ఆయన వ్యాఖ్యానించారు. 2024 ఆగస్టులో ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలు.. 'సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి పెరిగాయనీ, అలాగే 2026 ఫిబ్రవరిలో గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మలేషియా పర్యటన ద్వారా ద్వైపాక్షిక సహకారానికి మరింత బలం చేకూరిందని ఆయన పేర్కొన్నారు.

2024 నవంబరు 13న నిర్వహించిన మొదటి సమావేశం నాటి నుంచి సాధించిన పురోగతిని సంయుక్త కార్యబృందం సమీక్షించింది. ప్రారంభ సమావేశ చర్చాంశాలను ధ్రువీకరించి ఆమోదించడంతోపాటు.. పరస్పరం అంగీకరించిన కార్యక్రమాల్లో సమన్వయాన్నీ, వాటి అమలునూ వేగవంతం చేయడం కోసం ఇరువైపులా ప్రతినిధులను నియమించారు. భారత సాంకేతిక, ఆర్థిక సహకార (ఐటీఈసీ) కార్యక్రమం కింద సామర్థ్యాభివృద్ధిలో ప్రస్తుత సహకారంపై సమావేశంలో చర్చించారు. దీనికి సంబంధించి బోధన విభాగాలు, సంస్థాగత, క్షేత్రస్థాయి పర్యటనలు, కార్యక్రమ సమన్వయం, ప్రతినిధులకు అందించిన ఆతిథ్యంపై మలేషియా బృందం సానుకూల అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. 2026, 2027 బృందాలకు సంబంధించి ప్రతిపాదిత సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాలపైనా చర్చించారు. మలేషియా ఉన్నతాధికారుల కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను రూపొందించాలన్న ప్రతిపాదనను మలేషియా పక్షం స్వాగతించింది. ప్రభుత్వ రంగ ఆధునికీకరణ, పరిపాలన సంస్కరణలపై అనుభవాలను పంచుకునేందుకూ ఈ సమావేశం వేదికైంది. ప్రజలు, ప్రక్రియలు, సాంకేతికత ప్రాతిపదికగా.. ఆవిష్కరణలే ప్రధాన చోదక శక్తిగా ప్రభుత్వ రంగాన్ని తీర్చిదిద్దాలన్న తమ విధానాన్ని మలేషియా వివరించింది. ప్రజలే కేంద్రంగా సులభతరమైన, వేగవంతమైన సేవలను అందించడమే లక్ష్యంగా.. డిజిటల్ పాలన, కృత్రిమ మేధ, క్లౌడ్ సేవలు, ఉమ్మడి డిజిటల్ మౌలిక సదుపాయాలు, సైబర్ భద్రత, బ్లాక్‌చైన్, డేటా ఆధారిత నిర్ణయాలు, సమగ్ర అనుసంధాన ప్రభుత్వం వంటి అంశాలపైనా ఇరుపక్షాలు విస్తృతంగా చర్చించాయి.

# కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా అధ్యక్షతన తమిళనాడు...
# మహాబలిపురంలో సదరన్ జోనల్ కౌన్సిల్ 31వ సమావేశం

న్యూ ఢిల్లీ, ఆగష్టు 21:సౌత్ జోనల్ కౌన్సిల్ (ఎస్‌జడ్‌సీ) 31వ సమావేశం తమిళనాడులోని మహాబలిపురంలో ఈ నెల 20న జరగనుంది. ఈ సమావేశానికి కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా అధ్యక్షత వహిస్తారు. సదరన్ జోనల్ కౌన్సిల్‌లో తమిళనాడు, కేరళమ్, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలైన పుదుచ్చేరి, అండమాన్ - నికోబార్ దీవులకు సభ్యత్వం ఉంది.

1956 నాటి రాష్ట్రాల పునంవ్యవస్థీకరణ చట్టంలోని 15వ, 22వ సెక్షన్ల ప్రకారం సదరన్ జోనల్ కౌన్సిల్ సహా అయిదు జోనల్ కౌన్సిళ్లను ఏర్పాటు చేశారు. సదరన్ జోనల్ కౌన్సిల్‌కు కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా చైర్మన్‌గానూ, తమిళనాడు ముఖ్యమంత్రి శ్రీ సి. జోసెఫ్ విజయ్ వైస్ చైర్మన్‌గానూ ఉన్నారు. సభ్య రాష్ట్రాలకు చెందిన ముఖ్య మంత్రులు తలో సారి ఈ కౌన్సిల్‌కు వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తుంటారు. 31వ సమావేశాన్ని తమిళనాడు ప్రభుత్వ ఆధ్వర్యంలో కేంద్ర హోం శాఖ అధీనంలోని ఇంటర్ స్టేట్ కౌన్సిల్ సెక్రటేరియట్ నిర్వహించనుంది. ఈ సమావేశంలో దక్షిణాదికి చెందిన సభ్య రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర పాలిత ప్రాంతాలు లెఫ్టినెంట్ గవర్నర్లు, పరిపాలకులతో పాటు ప్రతి రాష్ట్రం నుంచి ఇద్దరు సీనియర్ మంత్రులు పాల్గొంటారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులు, సలహాదారులు, ఇతర సీనియర్ అధికారులతో పాటు కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు కూడా పాల్గొంటారు.

ప్రధాన కార్యదర్శుల స్థాయిలో ఓ స్థాయీ సంఘాన్ని కూడా జోనల్ కౌన్సిల్ నియమించింది. రాష్ట్రాలు ప్రస్తావించే అంశాలను మొదట జోనల్ కౌన్సిల్‌కు చెందిన స్థాయీ సంఘంలో చర్చకు నివేదించి, చర్చిస్తారు. ఆ తరువాత, మిగతా అంశాలను జోనల్ కౌన్సిల్ సమావేశం పరిశీలనకు అందిస్తారు.

సహకార పూర్వక సమాఖ్యవాదం ఆధారంగా 'టీమ్ భారత్' భావనను దేశ ప్రజల ఎదుటకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తీసుకువచ్చారు. ఈ దిశగా ప్రధాన తోడ్పాటును జోనల్ కౌన్సిళ్లు అందిస్తున్నాయి. రాష్ట్రాలు బలంగా ఉన్నప్పుడే దేశం బలంగా ఉంటుందనే భావనతో జోనల్ కౌన్సిళ్లు పనిచేస్తున్నాయి. ఈ కౌన్సిళ్లు రెండు లేదా అంతకన్న ఎక్కువ రాష్ట్రాలతో పాటు కేంద్రాన్నీ, రాష్ట్రాల్నీ ప్రభావితం చేసే అంశాలపై మాటామంతీని, చర్చని నిర్వహించడానికి వ్యవస్థిత యంత్రాంగాన్ని సమకూర్చడమే కాకుండా, దాని ద్వారా పరస్పర సహకారాన్ని పెంపొందింప చేసుకోవడానికి ఒక వేదికను కూడా అందిస్తాయి. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో, చర్చ ద్వారా పరిష్కారాలను కనుగొనడానికి ఒక శక్తిమంతమైన వేదికగా జోనల్ కౌన్సిల్ సమావేశాలు రూపొందాయి.

జోనల్ కౌన్సిళ్లు పోషించే పాత్ర ఏమిటంటే ప్రధానంగా సలహాలను ఇవ్వడం. ఏమైనప్పటికీ గత కొన్ని సంవత్సరాల్లో, ఈ కౌన్సిళ్లు వివిధ ప్రాంతాల మధ్య పరస్పర అవగాహన, సహకారం తాలూకు ఆరోగ్యదాయక బంధాన్ని పెంపొందించడంలో ఓ ముఖ్య కారకంగా మారాయి. గత సుమారు 12 సంవత్సరాల్లో అంటే, 2014 జూన్ మొదలు ఇప్పటివరకు.. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర మంత్రిత్వశాఖలు, విభాగాలు అందించిన సహకారంతో వివిధ జోనల్ కౌన్సిళ్లు, వాటి స్థాయీ సంఘాల సమావేశాలు కలుపుకొని మొత్తం 69 సమావేశాలను నిర్వహించారు.

కేంద్రం, సభ్య రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల మధ్య, సభ్య రాష్ట్రాలు, సభ్య కేంద్రపాలిత ప్రాంతాల మధ్య వివాదాలను, అంశాలను పరిష్కరించడానికి ఒక చక్కని వేదికను జోనల్ కౌన్సిళ్లు సమకూరుస్తున్నాయి. జాతీయ ప్రాధాన్యం కలిగిన విస్తృత అంశాలపై కూడా ఈ కౌన్సిళ్లు చర్చిస్తాయి. చర్చాంశాల్లో మహిళలు, బాలలకు వ్యతిరేకంగా అత్యాచార కేసుల సత్వర దర్యాప్తు, వాటిని శీఘ్రు గతిన పరిష్కరించడానికి ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు (ఎఫ్‌టీఎస్‌సీ)లు రంగంలోకి దిగడం, అలాగే విద్యకు సంబంధించిన అంశాలతో పాటు ఇతర అంశాలు భాగంగా ఉన్నాయి. వీటికి తోడు, ప్రాంతీయ స్థాయిలో సామాన్య హితంతో ముడిపడిన వివిధ అంశాలు.. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టానికి సంబంధించిన అంశాలు, నీళ్ల పంపకానికి సంబంధించిన ప్రధాన ప్రాజెక్టుల అంశాలు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్), పౌర విమానయానానికి సంబంధించిన అంశాలు, ఇతరత్రా అనేక అంశాలపై కూడా ఈ కౌన్సిళ్లు చర్చిస్తాయి.

# రైతాంగానికి సమృద్ధిగా సాగునీరందించాలి

అమరావతి, ఆగష్టు 21: ఎన్టీఆర్ జిల్లాలో ఉన్న 118 ఎత్తిపోతల పథకాలను పూర్తి చేసి రైతులకు సమృద్ధిగా సాగునీరు అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల నిమిత్తం సీపీఐ ఆధ్వర్యంలో జీపు జాతాను ఇబ్రహీంపట్నంలో శుక్రవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి రైతాంగానికి సాగునీటి ఇబ్బందులను తీర్చాలని డిమాండ్ చేశారు. రైతులు, ప్రజలతో ముఖాముఖిలు నిర్వహించి వారి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా కొండపల్లి ఐడీఏ కాలుష్య సమస్యపై పోరాటాలు చేస్తామన్నారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడతామన్నారు. ఈనెల 23వ తేదీ విజయవాడలో జీపు జాతా ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, పటాపంచల జమలయ్య, సిహెచ్. కోటేశ్వర రావు పాల్గొన్నారు.

# తూర్పుగూడెంలో ఉచిత వైద్య శిబిరం



నల్గొండ, ఆగష్టు 21:యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం తూర్పుగూడెం గ్రామంలో సర్పంచ్ దూపటి లక్ష్మీ వెంకటేష్ ఆధ్వర్యంలో శ్రీ వినాయక ఫౌండేషన్, మెడిసిటీ హాస్పిటల్స్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దూపటి లక్ష్మీ వెంకటేష్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. శిబిరంలో మెడిసిటీ హాస్పిటల్స్‌కు చెందిన వైద్య నిపుణులు పాల్గొని బీపీ, షుగర్‌తో పాటు గుండె, కంటి, దంత, చర్మ, కీళ్ల సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్యులు తగిన సూచనలు, సలహాలు అందించారు.

గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు సహకరించిన మెడిసిటీ హాస్పిటల్స్ వైద్య బృందానికి సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవడం పట్ల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాల స్టార్విన్, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ దూపటి వెంకటేష్, వార్డు సభ్యులు దూడల నరేష్, ఎదుల సందీప్, కారోబార్ హరిపుష్పం, గ్రామస్థులు రాములు, లింగమయ్య, సోమయ్య, శ్రీను, ఐలయ్య, ఉప్పలయ్య, మెడిసిటీ హాస్పిటల్ బాధ్యులు పవన్, సంజీవ, రాజు పాల్గొన్నారు.

# కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఉపేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు



నల్గొండ, ఆగష్టు 21:యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరుకు చెందిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి కాచారం కైలాసపురంలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన శ్రీ లక్ష్మీనారాయణ కల్యాణోత్సవం ముగింపు వేడుకల్లోనూ ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.

ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాచారం కైలాసపురంలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారిని ఈ ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని తరించారని తెలిపారు. ఆలయ అర్చకుడు వంగపల్లి అంజయ్య స్వామి ఆలయం తరఫున ఉపేందర్‌రెడ్డిని సత్కరించారు.

# అంకుర వ్యవస్థను బలోపేతం చేయడానికి ఫోన్ పే, షెల్ ఇండియాలతో డీపీఐఐటీ అవగాహనా ఒప్పందాలు

న్యూఢిల్లీ, ఆగష్టు 21: వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన పరిశ్రమల, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) గుర్తింపు పొందిన అంకుర సంస్థలకు మరింత మద్దతు అందించడానికి, ఆర్థిక వ్యవస్థలోని కీలక రంగాలలో ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ఫోన్ పే, షెల్ ఇండియా సంస్థలతో అవగాహన ఒప్పందాలపై డీపీఐఐటీ సంతకం చేసింది.

దేశంలో బలమైన, సమ్మిళిత, స్వావలంబన కలిగిన స్టార్టప్ వ్యవస్థను ప్రోత్సహిస్తూ సాంకేతికత, డిజిటల్ మౌలిక సదుపాయాలు, మార్గదర్శకత్వం, మార్కెట్ అవకాశాలు, పరిశ్రమల అనుసంధాన లభ్యతను పెంచడం ఈ ఒప్పందాల లక్ష్యం.

ఫోన్ పేతో భాగస్వామ్యం కింద, డీపీఐఐటీ గుర్తింపు పొందిన స్టార్టప్‌లకు ఫోన్‌పే వివిధ రకాల ప్రయోజనాలను అందిస్తుంది. వీటిలో పేమెంట్ గేట్‌వే ద్వారా లావాదేవీ క్రెడిట్‌లు, ఇండస్ యాప్‌స్టోర్ లభ్యత, ప్రత్యేక ఆన్‌బోర్డింగ్, సహాయక సేవలతో పాటు బ్రాండ్ గుర్తింపును పెంచుకునే అవకాశాలు లభిస్తాయి. స్టార్టప్‌లు తమ సామర్థ్యాలను బలోపేతం చేసుకోవడానికి, వేగవంతమైన వృద్ధిని సాధించడానికి ఫిన్‌టెక్, సేల్స్, గో-టు-మార్కెట్ వ్యూహాలు, వ్యాపార విస్తరణ వంటి అంశాలపై క్రమం తప్పకుండా మాస్టర్ క్లాస్‌లు, వెబినార్‌లను కూడా ఫోన్ పే నిర్వహిస్తుంది.

షెల్ ఇండియా తో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం ప్రధానంగా ఇంధన, వాతావరణ - సాంకేతిక రంగాలలో పనిచేస్తున్న స్టార్టప్ లకు మద్దతు ఇవ్వడంపై దృష్టి సారిస్తుంది. ఈ భాగస్వామ్యం ద్వారా షెల్ ఇండియా మార్గదర్శకత్వం, వ్యూహాత్మక సలహాలు, పెట్టుబడిదారులు, ఇన్‌క్యుబేటర్లతో అనుసంధానం అందించడంతో పాటు షెల్ ఇ4 స్మార్ట్ ఎనర్జీ ట్రాక్ లో పాల్గొనే అవకాశాలను కూడా కల్పిస్తుంది. ఈ కార్యక్రమం స్టార్టప్‌లకు వృద్ధి అవకాశాలను అందుకోవడానికి, వినూత్న పరిష్కారాలను విస్తరించడానికి, భారత స్వచ్ఛ ఇంధన మార్పునకు సహాయపడుతుందని భావిస్తున్నారు.

ఇంధన, వాతావరణ సంబంధ సాంకేతిక స్టార్టప్ వ్యవస్థలోని కొత్త ఆవిష్కరణలు, ఉత్తమ విధానాలను తెలియజెప్పే విభాగాల వారీ విజయగాథలు, శ్వేత పత్రాలు, విధానాల గురించి వివరణలు, పరిశ్రమ సంబంధ నివేదికలు, కేస్ స్టడీల ద్వారా విజ్ఞాన మార్పిడిని, స్టార్టప్ వ్యవస్థ అభివృద్ధిని ప్రోత్సహించడానికి కూడా షెల్ ఇండియాతో ఒప్పందం దోహదపడుతుంది.

మొత్తంమీద ఈ భాగస్వామ్యాలు స్టార్టప్‌లకు డిజిటల్ మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక రంగానికి చెందిన విజ్ఞానం, మార్గదర్శకత్వం మార్కెట్ అనుసంధానాలు, పెట్టుబడి అవకాశాల లభ్యతను బలోపేతం చేస్తాయని భావిస్తున్నారు. తద్వారా స్టార్టప్‌లు స్థిరంగా వృద్ధి చెందడానికి, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, భారత ఆర్థిక వృద్ధికి, సాంకేతిక పురోగతికి ఎంతగానో దోహదపడతాయి.

# సింగపూర్ ప్రధానమంత్రి లారెన్స్ వాంగ్‌తో శ్రీ పీయూష్ గోయల్ భేటీ

న్యూఢిల్లీ, ఆగష్టు 21:2026 ఆగష్టు 20న సింగపూర్‌లో పలు ఉన్నతస్థాయి ద్వైపాక్షిక, వ్యాపార సమావేశాల్లో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి శ్రీ పీయూష్ గోయల్ పాల్గొన్నారు. దీర్ఘకాలంగా కొనసాగుతున్న భారత్-సింగపూర్ ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, వ్యాపార రంగాల్లో సహకారాన్ని ముందుకు తీసుకెళ్లే దిశగా ఈ సమావేశాలు జరిగాయి.

పర్యటనలో భాగంగా తొలుత ఇస్తానాలో సింగపూర్ ప్రధాన మంత్రి శ్రీ లారెన్స్ వాంగ్‌తో శ్రీ పీయూష్ గోయల్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అనంతరం షాంగ్రిలా హోటల్‌లో జరిగిన 4వ భారత్-సింగపూర్ మంత్రుల స్థాయి రౌండ్‌టేబుల్ (ఐఎస్ఎంఆర్), 4వ భారత్-సింగపూర్ వాణిజ్య (ఐఎస్‌బీఆర్) సమావేశాల్లో పాల్గొన్నారు. ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేసే మార్గాలు, పరస్పర ప్రయోజనకరమైన సహకారానికి కొత్త అవకాశాలను గుర్తించడం వంటి అంశాలపై ఈ సమావేశాల్లో చర్చించారు. ఈ సమావేశాల అనంతరం పలు ఒప్పందాలపై సంతకాల కార్యక్రమం జరిగింది.

ప్రపంచ ఆర్థిక, సాంకేతిక వ్యవస్థ (జీఎఫ్‌టీఎన్), కెపెల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థలతో పాటు అంతర్జాతీయ వ్యాపార, సంస్థాగత రంగాలకు చెందిన సీనియర్ ప్రతినిధులతో మధ్యాహ్నం శ్రీ పీయూష్ గోయల్ వరుసగా ప్రభుత్వ-వ్యాపార (జీ2బీ) సమావేశాలు నిర్వహించారు. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు, జీసీసీ ఆధారిత వాణిజ్య పార్కులు, ఫిన్‌టెక్, సుస్థిర మౌలిక వసతులు వంటి రంగాల్లో భారత్, సింగపూర్ సహకారాన్ని బలోపేతం చేయడంపై ఈ సమావేశాల్లో చర్చించారు.

సింగపూర్ విదేశాంగ, వాణిజ్య, పరిశ్రమలశాఖ సహాయ మంత్రి శ్రీమతి గాన్ సియో హువాంగ్‌తో కలిసి సిటీ స్క్వేర్ మాల్‌లో ఏపీఈడీ ఏ-ఫెయింప్రైస్ కార్యక్రమాన్ని శ్రీ గోయల్ సందర్శించారు. భారత్, సింగపూర్ మధ్య పెరుగుతున్న వ్యవసాయ వాణిజ్యం, విస్తరిస్తున్న మార్కెట్ అనుసంధానాన్ని ఈ కార్యక్రమం ప్రతిబింబించింది.

ఫిక్కీ (ఎఫ్ఐసీసీఐ) ఆధ్వర్యంలో ఇన్‌సీడ్ ఆసియా క్యాంపస్‌లో నిర్వహించిన భారత్, సింగపూర్ వ్యాపార వేదికలో శ్రీ పీయూష్ గోయల్ పాల్గొన్నారు. "నూతన ప్రపంచ వృద్ధి సమీకరణంలో భారత్: ఆసియా, ప్రపంచంలోని వ్యాపారాలకు వృద్ధి, అవకాశాలు" అనే అంశంపై జరిగిన ముఖాముఖి చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వ్యాపార వర్గాల ప్రతినిధులతో జరిగిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో పాల్గొని వారి సందేహాలకు సమాధానమిచ్చారు.

ఈ వరుస సమావేశాలు భారత్, సింగపూర్ ఆర్థిక భాగస్వామ్యంలో కొనసాగుతున్న బలమైన పురోగతిని మరోసారి చాటిచెప్పాయి. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, వ్యాపార సంస్థల మధ్య సంబంధాలను మరింతగా విస్తరించడంతో పాటు పరస్పర ప్రయోజనకరమైన వృద్ధికి కొత్త అవకాశాలను సృష్టించేందుకు భారత్ కట్టుబడి ఉందని ఈ కార్యక్రమాలు స్పష్టం చేశాయి.

4వ భారత్-సింగపూర్ మంత్రివర్గ స్థాయి సమావేశంలో భారత ప్రతినిధి బృందంలో కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్, కేంద్ర విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి శ్రీ పీయూష్ గోయల్, వాణిజ్యశాఖ సహాయ మంత్రి శ్రీ జితిన్ ప్రసాద పాల్గొన్నారు. సింగపూర్ బృందంలో ఉప ప్రధాని, వాణిజ్య?పరిశ్రమల మంత్రి శ్రీ గాన్ కిమ్ యోంగ్, సీనియర్ మంత్రి, జాతీయ భద్రత సమన్వయ, హోం వ్యవహారాల మంత్రి శ్రీ కే షణ్ముగం, విదేశాంగ మంత్రి డాక్టర్ వివియన్ బాలకృష్ణన్, డిజిటల్ అభివృద్ధి, సమాచార శాఖ మంత్రి శ్రీమతి జోసెఫిన్ టియో, రవాణా, ఆర్థికశాఖ రెండో సహాయ మంత్రి శ్రీ జెఫ్రీ సియో పాల్గొన్నారు.

# భీమ్‌గల్‌లో కమ్యూనిటీ ఇంకుడు గుంత నిర్మాణం



నిజామాబాద్, ఆగష్టు 21:జలసిరి కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం పిప్రి (జె) గ్రామంలో కమ్యూనిటీ ఇంకుడు గుంత నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ అరిగెల జనార్ధన్ ముగ్గు పోసి పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జితేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ రౌతు గంగస్వామి, వీఆర్సీ సభ్యుడు పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సర్పంచ్ జనార్ధన్ మాట్లాడుతూ.. నీటిని పొదుపుగా వినియోగించడంతో పాటు భూగర్భ జలాలను పెంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. ప్రస్తుతం నీటిని సంరక్షించుకుంటే భవిష్యత్ తరాలకు, ముఖ్యంగా పిల్లలకు నీటి కొరత లేకుండా ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామంలోని ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి ఫామ్ పాండ్, ఊరికి ఊటకుంట ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రజలు ముందుకు రావాలని కోరారు. నీటి ప్రతి బొట్టును ఒడిసిపట్టేలా జల సంరక్షణ కార్యక్రమాల్లో గ్రామస్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య సింధియా అధ్యక్షతన 12వ బ్రిక్స్ కమ్యూనికేషన్ల శాఖ మంత్రుల సమావేశం

న్యూ ఢిల్లీ, ఆగష్టు 21:భారత్ తన బ్రిక్స్ అధ్యక్షతన 2026 ఆగస్టు 21న 12వ బ్రిక్స్ కమ్యూనికేషన్ల మంత్రుల సమావేశానికి ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సమావేశంలో బ్రిక్స్ సభ్య దేశాలకు చెందిన కమ్యూనికేషన్ల శాఖల మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొని సమాచార, ప్రసార సాంకేతికతలు (ఐసీటీ), డిజిటల్ పరివర్తన, ఆవిష్కరణలు, బలోపేతమైన డిజిటల్ మౌలిక వసతుల రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై చర్చించనున్నారు. కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం సింధియా ఈ 12వ బ్రిక్స్ కమ్యూనికేషన్ల మంత్రుల సమావేశానికి అధ్యక్షత వహిస్తారు. ఈ సమావేశం భారత్ నేతృత్వంలోని బ్రిక్స్ ప్రధాన ఇతివృత్తం "స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం", ఐసీటీ విభాగం ఇతివృత్తం "సురక్షితమైన భవిష్యత్తు కోసం ఆవిష్కరణ, సహకారం, పరివర్తన" ఆధారంగా నిర్వహించనున్నారు.

సమ్మిళిత, సురక్షిత, సుస్థిర డిజిటల్ అభివృద్ధిని ప్రోత్సహించడంతో పాటు బ్రిక్స్ దేశాల మధ్య సాంకేతిక సహకారాన్ని బలోపేతం చేయడంలో భారత్‌కున్న నిబద్ధతను ఈ ప్రాధాన్యతలు ప్రతిబింబిస్తాయి. ఉద్భవిస్తున్న కొత్త సాంకేతికతలు, డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు, భవిష్యత్తు నెట్‌వర్క్‌లు, సైబర్ భద్రత, సామర్థ్య పెంపుదల, విస్తృత డిజిటల్ అనుసంధానతపై బ్రిక్స్ సభ్య దేశాలు తమ ఆలోచనలను పంచుకోవడానికి ఈ 12వ బ్రిక్స్ కమ్యూనికేషన్ల మంత్రుల సమావేశం కీలక వేదికను అందిస్తుంది. బ్రిక్స్ దేశాలతో పాటు అభివృద్ధి చెందుతున్న దేశాల్లో డిజిటల్ పరివర్తనకు మద్దతు ఇచ్చేలా ఆచరణాత్మక సహకారాన్ని పెంపొందించడం, అత్యుత్తమ విధానాలను పరస్పరం పంచుకోవడంపై కూడా ఈ చర్చలు దృష్టి సారిస్తాయి.

# గీతారెడ్డి హత్యకు నిరసనగా బోధన్‌లో ర్యాలీ

నిజామాబాద్, ఆగష్టు 21: నల్గొండలో ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్ గీతారెడ్డి హత్యను తీవ్రంగా ఖండిస్తూ బోధన్ ట్రాస్మా ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ట్రాస్మా జిల్లా అధ్యక్షుడు కొడాలి కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో వివిధ ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గీతారెడ్డి హత్యకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, సిబ్బందికి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ట్రాస్మా ప్రతినిధులు పేర్కొన్నారు. అనంతరం ర్యాలీగా బోధన్ ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. గీతారెడ్డి హత్య ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రైవేట్ పాఠశాలలు, విద్యా సంస్థల్లో భద్రతా చర్యలు పటిష్టం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ట్రాస్మా జిల్లా అధ్యక్షుడు కొడాలి కిషోర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతూ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులపై దాడులు జరగడం ఆందోళనకరమన్నారు.

గీతారెడ్డి కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు.

# పాడి రైతులకు పశు వైద్యం అత్యంత కీలకం..

-మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్

-మూలపాడులో రూ.40 లక్షలతో పశువుల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన



ఇబ్రహీంపట్నం, ఆగష్టు 21: గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంతో పాటు పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్న రైతులు, పాడి రైతులకు పశు వైద్యం అత్యంత కీలకమని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. మూలపాడులో పశు పోషకులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సీఎస్ఆర్ నిధులు రూ.40 లక్షలతో పశువుల ఆసుపత్రి భవన నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పశువులకు సకాలంలో వైద్యం అందకపోవడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఉండకూడదనే ఉద్దేశంతో మూలపాడులో పశువుల ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సీఎస్ఆర్ నిధులను సద్వినియోగం చేసుకుంటూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. నూతన పశువుల ఆసుపత్రి అందుబాటులోకి వస్తే మూలపాడు గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల పశు పోషకులకు కూడా ప్రయోజనం కలుగుతుందన్నారు. పశువులకు వైద్య పరీక్షలు, చికిత్స, అవసరమైన సేవలు స్థానికంగానే అందుబాటులోకి రావడంతో రైతులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తగ్గుతాయని చెప్పారు.

పశుసంపదను పరిరక్షించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ఈ ఆసుపత్రి నిర్మాణం మరింత తోడ్పడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా మౌలిక వసతులు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. పశు పోషకుల సంక్షేమం కోసం అవసరమైన మరిన్ని చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

# బ్రిక్స్ ఐసీటీ విభాగంలో సుస్థిర, పటిష్ట డిజిటల్, ఐసీటీ వ్యవస్థలపై కీలకోపన్యాసం చేసిన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

న్యూఢిల్లీ, ఆగష్టు 21:'సుస్థిర, పటిష్ట డిజిటల్, ఐసీటీ వ్యవస్థలు: ప్రభావవంతమైన డిజిటల్ మౌలిక సదుపాయాలు – ప్రభుత్వ సేవల బలోపేతం, ఆర్థిక వృద్ధిపై అభివృద్ధి చెందుతున్న దేశాల ఆలోచనలు' అనే అంశంపై పూణేలో ఈ రోజు నిర్వహించిన బ్రిక్స్ ఐసీటీ బృంద చర్చలో కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కీలకోపన్యాసం చేశారు.

బ్రిక్స్ దేశాల మంత్రులు, విధాన రూపకర్తలు, విద్యావేత్తలు, పారిశ్రామిక ప్రముఖులతో కూడిన అంతర్జాతీయ ప్రతినిధి బృందాన్ని ఉద్దేశించి కేంద్ర సహాయ మంత్రి ప్రసంగించారు. పౌరుల సాధికారతే లక్ష్యంగా, ఆర్థిక పురోగతికి ఊతమిచ్చేలా సార్వత్రిక, సమ్మిళిత, పటిష్ట డిజిటల్ వ్యవస్థల రూపకల్పన దిశగా భారత్ వ్యూహాత్మక దృక్పథాన్ని ఈ సందర్భంగా ఆయన వివరించారు.

భారత్ విప్లవాత్మక ప్రయాణాన్ని వివరిస్తూ డాక్టర్ పెమ్మసాని కీలక వ్యాఖ్యలు చేశారు. మౌలిక సదుపాయాలంటే రహదారులు, ఓడరేవులు, విద్యుత్ గ్రిడ్ల వంటి భౌతిక ప్రాజెక్టులే అని భావించే సంప్రదాయ ధోరణి ఏళ్ల తరబడి కొనసాగిందనీ, అయితే భారత్ ఈ ఆలోచనలను మార్చేసిందనీ అన్నారు. గుర్తింపు, బ్యాంకింగ్, చెల్లింపులు, ధ్రువీకరించదగ్గ పత్రాలు, వినియోగదారుల సమ్మతితో కూడిన డేటా ఆధారంగా దేశ ప్రజలందరికీ ఉపయోగపడే 'డిజిటల్ మౌలిక సదుపాయాలు' అన్న కొత్త నమూనాను భారత్ ఆవిష్కరించిందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలో బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు, ప్రభుత్వ శాఖలు ప్రజలకు వివిధ సేవలను అందించేందుకు వీలుగా ఒక సార్వత్రిక, పరస్పర అనుసంధానంగా ఉండే ప్రాథమిక ప్రజా వేదికను ఏర్పాటు చేయడమే అసలైన వినూత్న ఆవిష్కరణ అని ఆయన వివరించారు.

భారత డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలకు మౌలిక ప్రాతిపదికలుగా నిలిచిన అంశాలను సహాయ మంత్రి ప్రముఖంగా పేర్కొన్నారు. కోట్లాది సిమ్ కార్డుల జారీ, బ్యాంకింగ్ సేవలు, ప్రామాణీకరణలను.. అత్యంత తక్కువ ఖర్చుతో కూడిన రిమోట్ వెరిఫికేషన్ ద్వారా ఇక్కడి ప్రాథమిక గుర్తింపు వ్యవస్థ సాధ్యం చేసిన తీరును డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ వివరించారు. చెల్లింపుల విషయానికొస్తే.. ఏకీకృత చెల్లింపుల వ్యవస్థ (యూపీఐ) ఆర్థిక రంగాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చిందన్నారు. 720 బ్యాంకులను అనుసంధానిస్తూ, దేశీయ డిజిటల్ లావాదేవీల్లో 85 శాతం వాటా సాధించడమే కాకుండా.. ప్రపంచవ్యాప్తంగా జరిగే రియల్ టైమ్ డిజిటల్ లావాదేవీల్లో దాదాపు 49 శాతం వాటాతో యూపీఐ ముందంజలో నిలిచిందనీ, తొమ్మిది భాగస్వామ్య దేశాలకు కూడా విస్తరించిందనీ ఆయన వెల్లడించారు.

ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డీబీటీ) పోర్టల్ ప్రాధాన్యాన్ని కూడా ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. అది 56 మంత్రిత్వశాఖలకు చెందిన 318 పథకాలను ఏకీకృతం చేసి మధ్యవర్తులను తొలగించింది. అలాగే డిజిలాకర్ వ్యవస్థ... 700 మిలియన్ల యూజర్లుండగా, 9 బిలియన్ల ధ్రువీకృత ఆధారా లను అది జారీ చేసింది. సార్వత్రిక డిజిటల్ వాణిజ్య వ్యవస్థ (ఓఎన్డీ సీ), గవర్నమెంట్ ఇ- మార్కెట్ ప్లేస్ (జీఈఎం), ఖాతా సమీకృత వ్యవస్థ (అకౌంట్ అగ్రిగేటర్ ఫ్రేమ్‌వర్క్) వంటి సరికొత్త కార్యక్రమాలు.. మార్కెట్ లభ్యతనూ, వ్యక్తిగత డేటా సార్వభౌమత్వాన్నీ ప్రజాస్వామ్యీకరిస్తున్నాయని పేర్కొన్నారు.

ఈ సాఫ్ట్‌వేర్ ఆవిష్కరణలకు మద్దతుగా భారత టెలికాం రంగం బలంగా విస్తరిస్తోంది. 4 బిలియన్ డాలర్లతో చేపట్టిన సార్వత్రిక విస్తరణ ప్రాజెక్టు ద్వారా ప్రస్తుతం 4జీ నెట్‌వర్కు దాదాపు 99 శాతం గ్రామాలకు విస్తరించిందని కేంద్ర సహాయ మంత్రి తెలిపారు. అలాగే 5 లక్షలకు పైగా బేస్ స్టేషన్ల ఏర్పాటుతో ప్రపంచంలో అత్యంత వేగంగా 5జీ సేవలను ప్రారంభించిన దేశాల్లో ఒకటిగా భారత్ నిలిచిందని వివరించారు. దీనికి తోడు 17 బిలియన్ డాలర్ల భారత్ నెట్ మిషన్ ద్వారా.. ప్రతి ప్రధాన గ్రామాన్నీ వేగవంతమైన ఆప్టికల్ ఫైబర్ నెట్వర్కుతో అనుసంధానిస్తున్నట్లు వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణ విషయంలోనూ భారత్ విశేష పురోగతి సాధించిందని డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. 2030 నాటికి 30 శాతం టెలికాం మౌలిక సదుపాయాలను పునరుత్పాదక ఇంధనంతో నడపాలన్నది జాతీయ లక్ష్యం కాగా.. టవర్ల నిర్వహణలో ఇప్పటికే 12.4 శాతం హరిత ఇంధన వినియో గాన్ని సాధించినట్లు ఆయన తెలిపారు.

డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయలు (డీపీఐ) అగ్రగామి ఆర్థిక వ్యవస్థలకు మాత్రమే పరిమితమైన విలాసం కాదనీ, అభివృద్ధి చెందిన దేశాల్లో సుస్థిరాభివృద్ధికి అది అత్యవసరమనీ స్పష్టం చేస్తూ.. డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తన ప్రసంగాన్ని ముగించారు. భారీ లైసెన్సింగ్ రుసుముల భారాన్ని తప్పించేందుకు వీలుగా.. ఓపెన్ సోర్స్ సాంకేతిక చట్రాలను పరస్పరం పంచుకునేలా ఒక పటిష్టమైన బ్రిక్స్ డిజిటల్ భాగస్వామ్యం ఏర్పడాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే అంతర్జాతీయ ఐసీటీ ప్రమాణాల రూపకల్పన సంస్థల్లో సరైన ప్రాతినిధ్యం లభించేలా.. ఉమ్మడి సామర్థ్యాభివృద్ధి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సదస్సులో గౌరవ బ్రెజిల్ కమ్యూనికేషన్ల శాఖ మంత్రి ఫ్రెడెరికో డి సిక్వేరా ఫిల్హో, దక్షిణాఫ్రికా కమ్యూనికేషన్లు, డిజిటల్ సాంకేతికతల శాఖ ఉపమంత్రి మోండ్లీ గుంగుబేలే, బ్రిక్స్ దేశాల ప్రతినిధులు, ఇతర మంత్రిత్వ శాఖల ప్రతినిధులు, అంతర్జాతీయ సాంకేతిక రంగ ప్రముఖులు పాల్గొన్నారు.

## గేదె దాడి.. యువకుడు బలి !

మెదక్, ఆగష్టు 21: గేదె దాడిలో ఓ యువకుడు మృతి చెందగా.. మరో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని అంతారం గేటు వద్ద గురువారం రాత్రి చోటు చేసుకుంది .

పోలీసుల కథనం ప్రకారం.. కొల్చారం మండలం రాంపూర్ గ్రామానికి చెందిన ఆకుల దుర్గ ప్రసాద్ (21) తన స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై నర్సాపూర్ నుంచి రాంపూర్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో అంతారం గేటు వద్ద రోడ్డుపై గేదెలు దాటుతుండగా.. ఓ గేదె ఒక్కసారిగా వారిపై దాడి చేసింది.

ఈ ఘటనలో దుర్గ ప్రసాద్ గేదె కొమ్ముల్లో చిక్కుకుని తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి స్నేహితుడికి తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. గేదె కొమ్ముల్లో చిక్కుకున్న దుర్గ ప్రసాద్ మృతదేహాన్ని బయటకు తీసేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అనుమతి లేకుండా రాస్తారోకో.. ఆర్డీవో కార్యాలయం వద్ద ఉద్రిక్తత

### కానిస్టేబుల్ ఫిర్యాదుతో 38 మందిపై కేసు.. రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్



మహబూబ్‌నగర్, ఆగష్టు 21:నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో గురువారం టీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన మహా ధర్నా సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారనే ఆరోపణలపై మాజీ ఎమ్మెల్యే, టీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి జనార్దన్‌రెడ్డి అనుచరులతో పాటు మొత్తం 38 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అనుమతి లేకుండా రోడ్డుపైకి వచ్చి రాస్తారోకో నిర్వహించడం, వందలాది మందితో ఆర్డీవో కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి ప్రజలకు, వాహనదారులకు ఆటంకం కలిగించడం, పబ్లిక్ న్యూసెన్స్‌కు పాల్పడటం వంటి కారణాలతో కేసు నమోదు చేసినట్లు నాగర్‌కర్నూల్ సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. గాంధీ పార్కులో ధర్నా నిర్వహించేందుకు అనుమతి తీసుకున్నప్పటికీ టీఆర్ఎస్ శ్రేణులు ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట సుమారు గంటపాటు రాస్తారోకో నిర్వహించి, అనంతరం ఆర్డీవో కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకున్న టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులతో వాగ్వాదం చోటుచేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుషులకు మాత్రమే అనుమతి ఇస్తామని చెప్పినా వినకుండా కార్యాలయంలోకి వెళ్లి బైఠాయించారని, గేటును తీసుకుని వెళ్లడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారిందని పేర్కొన్నారు. పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ కొందరు దూసుకురావడంతో ఇబ్బందులు తలెత్తాయని తెలిపారు. అనంతరం ఆర్డీవో స్వయంగా బయటకు వచ్చి టీఆర్ఎస్ నాయకులతో మాట్లాడి వినతిపత్రం స్వీకరించారు. ఈ ఘటనపై కానిస్టేబుల్ దేవేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 38 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్‌రెడ్డి వెల్లడించారు. కళ్యాణలక్ష్మి పథకంపై ప్రజా సమస్యల నేపథ్యంలో టీఆర్ఎస్ చేపట్టిన ఈ భారీ ధర్నా, అనంతరం కేసుల నమోదు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## ఖనిజ భద్రత, దేశీయ ఇనుప ఖనిజ లభ్యతను బలోపేతం చేసేందుకు ఎంఎండీఆర్ సవరణ చట్టం-2026ను స్వాగతించిన సెయిల్

న్యూఢిల్లీ, ఆగష్టు 21:కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన గనులు, ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) సవరణ చట్టం–2026ను స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్) స్వాగతించింది. ఖనిజ రంగంలో స్థిరమైన ఆర్థిక విధానాన్ని, దీర్ఘకాలిక నిబంధ నల భద్రతను ఏర్పాటు చేయటంలో ఇది కీలక సంస్కరణ అని పేర్కొంది.

సొంతంగా ఇనుప ఖనిజం, బొగ్గు గనులను నిర్వహించే సెయిల్ సంస్థకు, ఈ సంస్కరణల వల్ల గనుల నిర్వహణ మరింత లాభసాటిగా మారనుంది. గనుల అభివృద్ధికి పెట్టుబడులు సులభతరమై, దీర్ఘకాలికంగా ముడి సరకుల భద్రత మరింత బలపడుతుంది. పన్ను విధానంలో మరింత స్పష్టత రావటం వల్ల ఖనిజ వనరులను సెయిల్ సమర్థవంతంగా ఉపయోగించుకోవటానికి, అభివృద్ధి చేయటానికి తోడ్పడుతుంది. ఇనుప ఖనిజ తవ్వకాలను మరింత ప్రోత్సహిస్తుంది. ఈ సంస్కరణ ముఖ్యంగా దేశీయ మార్కెట్లో ఇనుప ఖనిజం లభ్యతను పెంచటానికి కూడా దోహదపడుతుంది. సొంత గనుల నిర్వహణ మెరుగవటం వల్ల సెయిల్ నిబంధనలకు లోబడి మార్కెట్లో అమ్మకానికి అదనపు ఇనుప ఖనిజాన్ని అందుబాటులో ఉంచగలదు. ఇది దేశీయ సరఫరా వ్యవస్థలను బలోపేతం చేస్తుంది. భారత ఉక్కు పరిశ్రమకు దేశీయంగా ఇనుప ఖనిజం సులభంగా లభించేలా మద్దతిస్తుంది.

ఈ సంస్కరణ ద్వారా పెట్టుబడులు, ఉత్పత్తికి ప్రోత్సాహం లభిస్తుందని, దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుందని, ఖనిజ, ఇంధన భద్రత బలపడుతుందని, ఖనిజ ఆధారిత పరిశ్రమల పోటీతత్వం మెరుగవుతుందని అంచనా.

ఆత్మనిర్భర్ భారత్, వికసిత్ భారత్ ఆశయ సాధనకు అనుగుణంగా ఖనిజ వనరుల బాధ్యతాయుత, సుస్థిర అభివృద్ధికి, అంతర్గతంగా ముడి సరకుల భద్రతను బలోపేతం చేయటానికి, దేశీయ మార్కెట్‌కు ఎక్కువ మొత్తంలో ఇనుప ఖనిజాన్ని అందుబాటులోకి తీసుకురావటానికి సెయిల్ కట్టుబడి ఉంది.

## గుడివాడలో వైభవంగా రెండో శ్రావణ శుక్రవారం పూజలు..

### –అమ్మవారి ఆలయాల్లో భక్తుల రద్దీ





అమరావతి, ఆగష్టు 21:గుడివాడ పట్టణంలో రెండో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో పూజలు వైభవంగా జరిగాయి. వరలక్ష్మీ వ్రతాలను పురస్కరించుకుని ఉదయం నుండే భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారి ఆలయాలకు తరలివచ్చారు. మహిళా భక్తులు అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పట్టణంలో విశిష్టత కలిగిన శ్రీ విజయ దుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారు విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితులు పునీత్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, నిర్వహించారు.

ఈ పూజా కార్యక్రమాల్లో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా రావి, యలవర్తి మాట్లాడుతూ శ్రీ విజయ దుర్గ అమ్మవారి ఆలయంలో జరుగుతున్న వరలక్ష్మీ వ్రత పూజల్లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భక్తులందరికీ రెండో శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రత శుభాకాంక్షలు చెప్పారు.

ప్రజలందరూ అమ్మవారి ఆశీస్సులతో సుభిక్షంగా, సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

సీనియర్ టీడీపి నాయకులు చేకూరు జగన్మోహన్రావు, ఆలయ ధర్మకర్తల కమిటీ చైర్మన్ బోడబళ్ల హరిబాబు, కమిటీ సభ్యులు కోడూరి ప్రభు, టిడిపి నాయకులు దేవాది నాగేశ్వరరావు, రెడ్డి షణ్ముఖ, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## శక్తి స్కీం పాలిటెక్నిక్ విద్యార్థులకు శాపం.. ఎస్ఎఫ్ఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్

కరీంనగర్, ఆగష్టు 21: శక్తి స్కీం పాలిటెక్నిక్ విద్యార్థులకు శాపంగా మారిందని ఎస్ఎఫ్ఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను పరిరక్షించాలని, జీవో నం.97ను వెంటనే రద్దు చేయాలని డిమాం డ్ చేస్తూ శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీసులకు తోపులాట జరిగింది. తీవ్ర ఉద్రిక్తతల అనంతరం పోలీసులు ఆందోళనకారులను అరెస్టు చేసి సీటీపీసీకి తరలించారు. ఈ సందర్భంగా గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పేరుతో తీసుకువస్తున్న విధానాల ద్వారా పాలిటెక్నిక్ డిప్లమా కోర్సులను అనుసంధానం చేయడం విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే నిర్ణయమని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్య అనేది ప్రత్యేకమైన సాంకేతిక విద్యా వ్యవస్థ అని, దాని ప్రమాణాలను మరింత మెరుగుపరచాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా డిప్లమా కోర్సులను ఇతర శిక్షణా కోర్సులతో అనుసంధానం చేయడం సరికాదని అన్నారు. ఈ నిర్ణయం వల్ల పాలిటెక్నిక్ విద్యార్థుల విద్యా ప్రమాణాలు, ఉన్నత విద్యా అవకాశాలు, ఉపాధి అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని జీవో నం. 97ను వెంటనే రద్దు చేయాలని, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను బలోపేతం చేయాలని, అవసర మైన మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. మంత్రి వివేక్ వెంకటస్వామి శక్తి స్కీం విద్యార్థులకు వరం అంటూ ప్రచారం చేయడం సరికాదని, అదే సమయంలో ప్రభుత్వ విద్యారంగానికి తగిన బడ్జెట్ కేటాయించకుండా విద్యా వ్యవస్థ ను ప్రైవేటీకరణ వైపు తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తర్వా త విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని అన్నారు. ఇప్పటికే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందక అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇప్పుడు శక్తి స్కీం పేరుతో పాలిటెక్నిక్ విద్యను మరింత కార్పొరేట్ వైపు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. పాలిటెక్నిక్ విద్యను ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ వైపు తీసుకెళ్లే చర్యలను వెంటనే నిలిపివేయాలని, శక్తి స్కీంను రద్దు చేయాలని, జీవో నం. 97ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని సందర్భంగా హెచ్చరించారు.

## ప్రజా సేవ విధానాల అభ్యసనం, ఆవిష్కరణల్లో సంస్థాగత అనుసంధానాలను భారత్-మారిషస్‌లు బలోపేతం చేసుకోవాలి: డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, ఆగష్టు 21:సీనియర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ మేరీ జోయెల్ సాండ్రిన్ వాలెరే నేతృత్వంలోని మారిషస్ సీనియర్ ప్రభుత్వోద్యోగుల ప్రతినిధి బృందం ఈ రోజు కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్‌తో సమావేశమైంది. నేషనల్ సెంటర్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్ (ఎన్‌సీజీజీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న... ఉద్యోగుల సామర్థ్యాలను పెంపొందించే ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ఈ ప్రతినిధి బృందం పాల్గొం టున్నది.

వేగంగా మారుతున్న పాలనా విధానాల్లో ప్రభుత్వోద్యోగులు భవిష్యత్తుకు సిద్ధంగా ఉండేందుకు వీలుగా... సాంప్రదాయిక శిక్షణకు అతీతంగా బాధ్యతల–ఆధారితమైన, నైపుణ్య–ఆధారితమైన నిరంతర అభ్యసనం దిశగా సామర్థ్యాలను పెంపొందించే ఈ కార్యక్రమం ముందుకుసాగాలని ప్రధానమంత్రి కార్యాలయ సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణు ఇంధనం, అంతరిక్ష శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. నేషనల్ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎన్‌సీజీజీ) నిర్వహించిన... మారిషస్ సీనియర్ ప్రభుత్వోద్యోగుల సామర్థ్యాలను పెంపొందించే 4వ ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

న్యూఢిల్లీలో ఈ నెల 17 నుంచి 22 వరకు 'నేషనల్ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్' (ఎన్‌సీజీజీ) ఆధ్వర్యంలో, మారిషస్ ప్రభుత్వోద్యోగుల సామర్థ్యాలను పెంపొందించడం లక్ష్యంగా 4వ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రజా పాలన, అధికారుల సామర్థ్యాలను పెంపొందించడం వంటి రంగాల్లో భారత్–మారిషస్ దేశాలు ఈ కార్యక్రమం ద్వారా పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకుంటున్నాయి. మారిషస్‌కు చెందిన 11 మంత్రిత్వశాఖలు, విభాగాల నుంచి 15 మంది సీనియర్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. పరిపాలనా పద్ధతులు, సంస్థాగత అనుభవాలు, ప్రజా సేవలను అందించడంలో అనుసరించే విధానాలను పరస్పరం పంచుకునేందుకు ఈ కార్యక్రమం అవకాశం కల్పిస్తుంది.

మార్చి 2025లో మారిషస్ ప్రజా సేవ, పరిపాలనా సంస్కరణల మంత్రిత్వశాఖతో ఎన్‌సీజీజీ ఒక అవగాహన ఒప్పందం చేసుకుంది. దీని కింద రాబోయే ఐదేళ్ల కాలంలో 500 మంది మారిషస్ ప్రభుత్వోద్యోగుల సామర్థ్యాలను పెంపొందించడం లక్ష్యంగా భారత్ ప్రత్యేక శిక్షణనివ్వనున్నట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. మారిషస్‌లోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలకు చెందిన 70 మంది ప్రభుత్వోద్యోగులు పాల్గొన్న గత మూడు కార్యక్రమాల తర్వాత... ప్రస్తుతం నాల్గో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం కొనసాగుతోంది.

సామర్థ్యాలను పెంపొందించే ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం... సాంప్రదాయికమైన, ఒకేసారి ఇచ్చే శిక్షణకు అతీతంగా అభివృద్ధి చెందిన, బాధ్యత ల–ఆధారితమైన, నైపుణ్యాల –ఆధారితమైన నిరంతర అభ్యసనంగా ముందుకుసాగాలని డాక్టర్ జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. సాంకేతికత, డేటా, కృత్రిమ మేధ, పౌరులకు సేవలందించడంలో కొత్త నమూనాలు వంటి వాటితో పాలన అభివృద్ధి చెందుతున్న క్రమంలో... ప్రభుత్వ ఉద్యోగులను భవిష్యత్తుకు సిద్ధంగా ఉంచాల్సిన ప్రాముఖ్యతను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ రంగంలో తన అనుభవాన్ని పంచుకోవడానికి, మారిషస్ ప్రజా సేవా వ్యవస్థ అవసరాలకు అనుగుణంగా దానిని అన్వయించగల మార్గాలను అన్వేషించేందుకు భారత్ సుముఖంగా ఉందనీ కేంద్ర మంత్రి తెలిపారు.

'అటల్ బిహారీ వాజ్‌పేయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ సర్వీస్ అండ్ ఇన్నోవేషన్' ను భారత్–మారిషస్ దేశాల మధ్య కీలక సంస్థాగత వారధిగా కేంద్ర మంత్రి అభివర్ణించారు. అధ్యాపక బృందం, శిక్షణా సామర్థ్యాల మెరుగుదల, ఉమ్మడి కార్యక్రమాల రూపకల్పన, సంస్థాగత అభివృద్ధి, జ్ఞానాన్ని పరస్పరం పంచుకోవడం, కేస్ స్టడీలు, అవసరమైన రంగాల్లో ఉమ్మడి పరిశోధన వంటి అంశాల్లో... భారత్‌లోని ఎల్‌బీఎస్ఎన్ఏ, ఐఐపీఏ, ఐఎస్‌టీఎమ్ సంస్థలు, మారిషస్‌కు చెందిన ఏబీవీఐపీఎస్ఐ మధ్య బలమైన సంబంధాలు పెంపొందించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

డిజిటల్ సేవల పంపిణీ, ఫిర్యాదుల పరిష్కారం, సాంకేతికత ఆధారిత పాలనలో భారత్ అనుభవాన్ని ప్రస్తావిస్తూ... పౌర కేంద్రిత పాలన, డిజిటల్ పరివర్తనలో సహకారానికి గల అవకాశాలను డాక్టర్ జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. సాంకేతికతతో పాటు పరిపాలనా సంస్కరణలు, సంస్థాగత జవాబుదారీతనం గల సేవల పంపిణీ కోసం పౌర–కేంద్రిత విధానం కీలకమని ఆయన ఉద్ఘాటించారు. కృత్రిమ మేధ, పరిపాలన, భారత డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సీపీజీఆర్ఏఎమ్ఎస్, ఫిర్యాదుల పరిష్కారం, విద్య, సేవల పంపిణీలో డిజిటల్ పరివర్తన, పింఛను సంస్కరణలు, ఆధార్, పెట్టుబడులను ప్రోత్సాహించడం, ఎంఎస్ఎంఈలకు వ్యాపార సౌలభ్యం, వ్యవస్థాపనకు ప్రోత్సాహం, ఘన వ్యర్థాల నిర్వహణ, పట్టణ స్థానిక సంస్థలు సహా పలు సమకాలీన పరిపాలనా అంశాలు కేంద్రంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎఫ్ఐటీటీలోని స్టార్టప్ ఇండియా, ఐఐటీ ఢిల్లీ, ప్రధానమంత్రి సంగ్రహాలయ, ప్రైడ్, పీఎం గతి శక్తి, భారత ఎన్నికల సంఘం వంటి సంస్థలను, కార్యక్రమాలనూ మారిషస్ ప్రతినిధి బృందం స్వయంగా పరిశీలిస్తుంది.

ఒకరి పాలనా అనుభవాల నుంచి మరొకరు నేర్చుకోవాల్సిన ప్రాముఖ్యతనూ కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. సామర్థ్యాలను పెంపొందించే కార్యక్రమం కేవలం అధికారులను శిక్షణకు పంపడానికే పరిమితం కాకూడదనీ... మరో ప్రభుత్వ యంత్రాంగం సవాళ్లను ఎలా ఎదుర్కొంటోంది, ఏ విధానాలు పాలనలో చక్కగా పనిచేస్తాయి, ఏ పాఠాలను విభిన్న సందర్భాలకు అనుగుణంగా మార్చుకోవచ్చు అనే విషయాలను అర్థం చేసుకోవడానికీ ఇది దోహదపడాలని ఆయన అన్నారు. ప్రభుత్వ పరిపాలన అనుభవాలను నమోదు చేసి, వాటిని ప్రభుత్వోద్యోగులకు ఆచరణాత్మక అభ్యసనంగా మార్చే కార్యక్రమంగా 'అమృత్ జ్ఞాన్ కోశ్'ను ఆయన అభివర్ణించారు.

సముద్రతీర దేశాలుగా భారత్–మారిషస్‌ల కోసం బ్లూ ఎకానమీ, సముద్ర సాంకేతికతలు, మత్స్య పరిశ్రమ, ఉప్పునీటిని మంచినీటిగా మార్చే ప్రక్రియ, సుస్థిర అభివృద్ధి పరస్పర ప్రయోజనకరమైన రంగాలని డాక్టర్ జితేంద్ర సింగ్ గుర్తించారు. ప్రత్యేక కార్యక్రమాలు, నైపుణ్యాలను పంచుకోవడం, ఉమ్మడి అభ్యసన కార్యక్రమాల ద్వారా... సామర్థ్యాలను పెంపొందించడంలో సహకారాన్ని ఈ అభివృద్ధి చెందుతున్న రంగాలతో అనుసంధానించవచ్చని కేంద్ర మంత్రి తెలిపారు. ఈ సహకారంలోని తదుపరి దశ... వ్యక్తిగత కార్యక్రమాల నుంచి రెండు ప్రభుత్వ సేవల మధ్య మరింత నిర్మాణాత్మకమైన, శాశ్వత భాగస్వామ్యం దిశగా సాగాలని కేంద్ర మంత్రి అన్నారు. ఏబీవీఐపీఎస్ఐ, భారతీయ శిక్షణ సంస్థల మధ్య సంస్థాగత సంబంధాలను బలోపేతం చేయాలనీ, ఐజీవోటీ కర్మయోగి భాగస్వామ్యాన్ని మరింత అభివృద్ధి చేయాలనీ, మారిషస్ ప్రభుత్వోద్యోగుల కోసం ప్రత్యేకంగా సంబంధిత అభ్యసన వనరులను సృష్టించాలనీ డాక్టర్ జితేంద్ర సింగ్ సూచించారు.

## పునర్వ్యవస్థీకృత జాతీయ మైనారిటీల కమిషన్ తొలి సమావేశం: మైనారిటీల సంక్షేమం-రక్షణ చర్యలపై సమీక్ష

న్యూఢిల్లీ, ఆగష్టు 21:జాతీయ మైనారిటీల కమిషన్ (ఎన్‌సీఎం) పునర్వ్యవస్థీకృతమైన నేపథ్యంలో చైర్మన్ శ్రీ హర్జీత్ సింగ్ గ్రేవాల్ అధ్యక్షతన ఇవాళ తొలిసారి సమావేశమైంది.

ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ శ్రీమతి ఎస్.మునవరి బేగం, సభ్యులు శ్రీ బెర్జిన్ దేశాయ్, శ్రీ గ్లెన్ ఇ సౌజా టిక్లో కూడా పాల్గొన్నారు. అలాగే, ఎన్‌సీఎం కార్యదర్శి శ్రీ సుచీంద్ర మిశ్రా, సంయుక్త కార్యదర్శి డాక్టర్ అత్యానంద్ సహా కమిషన్ అధికారులు కూడా దీనికి హాజరయ్యారు.

మైనారిటీల సంక్షేమం, ప్రయోజనాలకు సంబంధించిన వివిధ అంశాలను కమిషన్ ఈ సందర్భంగా సమీక్షించింది. దీంతోపాటు పరిశీలనార్థం నివేదించిన అనేక విషయాలపై చర్చించింది.

మరోవైపు కమిషన్ కార్యకలాపాలపై సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించడంతో పాటు అపరిష్కృత అంశాలపై తదుపరి కార్యాచరణపైనా చర్చించారు.

మైనారిటీల ప్రగతికి కృషి, వారి ప్రయోజనాల పరిరక్షణకు ఉద్దేశించిన రక్షణ చర్యల అమలుపై పర్యవేక్షణ కమిషన్ ప్రధాన బాధ్యతలని చైర్మన్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

